# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

**రైతుకు మేలు జరిగితే సాక్షికి కడుపుమంట ఎందుకు?**

**మంత్రి అచ్చెన్న మండిపాటు**

6

# ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే సహించం



- మా కష్టం.. మా శ్రమ.. ప్రతిభతో ఉద్యోగాలు
- నిజాలు తెలుసుకోవాలి.. నిందలు మానుకోవాలి
- అవమానించాలని చూస్తే బుద్ధిచెప్పడం ఖాయం
- గొడ్డలి పార్టీపై గర్జించిన ఉపాధ్యాయులు
- మెగా డీఎస్సీపై దుష్ప్రచారాన్ని నిరసిస్తూ ఆత్మగౌరవ ర్యాలీ

2

ఏపీ ప్రభుత్వం పారదర్శకంగా నిర్వహించిన మెగా డీఎస్సీపై వైసీపీ చేస్తున్న దుష్ప్రచారానికి నిరసనగా డీఎస్సీ 2025లో ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులు ఆదివారం 'ఛలో విజయవాడ'తో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి వేల మంది తరలివచ్చి నగరంలో భారీ ర్యాలీ చేపట్టారు. ఎన్నో ఏళ్ల కష్టం..ప్రతిభతో ఉద్యోగాలు సాధిస్తే అవమానించేలా దుష్ప్రచారం చేస్తున్నారు.. కష్టపడి కొలువులు సాధిస్తే నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే సహించబోమని హెచ్చరించారు.



## వివాహ వేడుకల్లో సీఎం చంద్రబాబు

ప్రముఖ సినీనిర్మాత, నటుడు బండ్ల గణేష్ కుమార్తె జనని వివాహ వేడుకకు ముఖ్యమంత్రి చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు హాజరయ్యారు. హైదరాబాద్ జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ వేడుకల్లో నూతన వధూవరులు జనని, సూర్యతేజలను ఆశీర్వదించారు.

# సభా పర్వం




- నేటి నుంచే అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు
- రాజధానిలో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం
- ఏఐ సాయంతో ఇన్విజిబుల్ పోలీసింగ్
- కీలక అంశాలపై చర్చించే అవకాశం
- గ్రూప్1లో అక్రమాలపై నిలదీతకు సిద్ధమైన అధికార పక్షం సభ్యులు
- మెగా డీఎస్సీపైనా స్ట్రాంగ్ కౌంటర్
- స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల బిల్లు తీసుకొచ్చే యోచనలో ప్రభుత్వం

4

ఏపీ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం భద్రతా ఏర్పాట్లను కట్టుది ట్టం చేశారు. ఏఐ సాయంతో ఇన్విజిబుల్ పోలీసింగ్ నిర్వహించ నున్నారు. మొదటిరోజు ఐదు బిల్లులపై చర్చ జరిగే అవకాశం ఉంది. రెండోరోజు రాష్ట్రంలో తాజా పరిణామాలు, ఎల్‌నినో పరిస్థితులపై చర్చించి అందుకు తగ్గ కార్యాచరణ చేపట్టేందుకు సిద్ధమవుతోంది. 19న మూడోరోజు బీసీ రిజర్వేషన్లు, బీసీ రక్షణ చట్టానికి సంబంధించి చర్చకు వచ్చే అవకాశం ఉంది. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించే అంశానికి సంబంధించి బిల్లు తెచ్చేందుకు ప్రభుత్వం భావిస్తోంది. చివరిరోజు రాష్ట్రంలో శాంతిభద్రతలు, నీటి పారుదలకు సంబంధించి చర్చకు వచ్చే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే గత ప్రభు త్వంలో గ్రూప్ 1లో జరిగిన అక్రమాలపై నిలదీసేందుకు అధికార పక్షం సిద్ధమవు తోంది. అంతేకాకుండా మెగా డీఎస్సీపై చేస్తున్న దుష్ప్రచారంపై సాక్ష్యాధారాలతో స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చేందుకు సిద్ధమైంది.

# నేటి నుంచే భోగాపురం సేవలు




- ఉదయం నుంచి విమాన రాకపోకలు ప్రారంభం
- తొలిరోజు 31 సర్వీసులు నడిపేందుకు సిద్ధం
- విశాఖ నుంచి నిలిచిపోనున్న సర్వీసులు
- అక్కడి ప్రయాణికుల కోసం ఎలక్ట్రిక్ బస్సు
- స్థానికులకు కనువిందు చేయనున్న విమానాలు

5

భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం సోమవారం నుంచి ప్రయాణికులకు అందుబా టులోకి రానుంది. ఉదయం నుంచి వాణిజ్యపరమైన విమాన రాకపోకలు ప్రారంభం కానున్నాయి. తొలిరోజు 31 సర్వీసులు నడిపేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. భోగాపురం నుంచి హైదరాబాద్‌కు ఉదయం 8.55 గంటలకు తొలి సర్వీసు నడవనుంది. ఇప్పటివరకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు ఉన్న అంతర్జాతీయ ట్రావెల్ కోడ్ 'వీటీజెడ్'ను భోగాపురానికి బదిలీ చేశారు.

చైతన్యరథం



## వైసీపీకి తగిన బుద్ధి చెబుతాం!

# నిందలు మానుకో.. నిజం తెలుసుకో




- విజయవాడలో గురువుల గర్జన
- మెగా డీఎస్సీపై వైసీపీ దుష్ప్రచారానికి నిరసనగా ఉపాధ్యాయుల ఆత్మగౌరవ యాత్ర
- భారీ ర్యాలీ చేపట్టిన ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం, పశ్చిమ గోదావరి జిల్లాల టీచర్లు
- రాజకీయాల్లో జగన్మోహన్ రెడ్డిలా తమకు కారుణ్య నియామకం జరగలేదని మండిపాటు
- ప్రతిభతో ఉద్యోగం సాధించిన వాళ్లం.. ప్రకాశం బ్యారేజీలో పడేస్తామని హెచ్చరిక
- జగన్ ఐదేళ్లలో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదు..ఇప్పుడు నిరాధార ఆరోపణలు
- 16 వేల కుటుంబాల్లో వెలుగులు నింపిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్


విజయవాడ (చైతన్యరథం): తాము కష్టపడి చదివి ఉద్యోగాలు తెచ్చుకుంటే వాటిపై జగన్ రెడ్డి విషప్రచారం చేస్తున్నారరని మెగా డీఎస్సీ 2025 ఉపాధ్యాయులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని సంవత్సరాల తమ శ్రమను, తెలివితేటలను తక్కువ చేస్తూ నిరాధార నిందలు వేయటం వైసీపీకి తగదని హెచ్చరించారు. రాజకీయ ప్రయోజనాల కోసం తమ జీవితాలతో ఆడుకుంటే తగిన బుద్ధి చెబుతామని స్పష్టం చేశారు. మెగా డీఎస్సీపై విష ప్రచారం మానకుంటే వైసీపీని ప్రకాశం బ్యారేజీలో పడేస్తామని హెచ్చరించారు. వైసీపీ నేతలు పదేపదే తప్పుడు ఆరోపణలతో తమను అవమానిస్తున్నారంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠాలతో పాటు గుణపాఠాలు కూడా చెబుతామంటూ నినాదించారు. 2025 డీఎస్సీ ప్రతిభగల డీఎస్సీ అని టీచర్లు వ్యాఖ్యానించారు. జగన్ అండ్ కో తమపై బురద జల్లటం మానుకుని.. బుద్ధి తెచ్చుకోవాలని ప్లకార్డులు పట్టుకుని టీచర్లు ఈ ర్యాలీ చేపట్టారు. తమతో పెట్టుకోవద్దని హెచ్చరించారు. మేము పిల్లలకు విలువలు నేర్పుతున్నాం. మాకే విలువలు లేవన్నట్టు మాట్లాడటం సరికాదన్నారు. వైసీపీ నాయకులు తమను రాజకీయ పావులుగా ఉపయోగించొద్దని, ఉపాధ్యాయులపై ఆరోపణలు చేయడం ద్వారా సమాజంలో వారి గౌరవాన్ని దెబ్బతీయొద్దని సూచించారు. తమ వృత్తి గౌరవాన్ని కాపాడుకోవడానికి రోడ్డెక్కాల్సి వచ్చిందన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పారదర్శకంగా నిర్వహించిన మెగా డీఎస్సీపై వైసీపీ చేస్తున్న దుష్ప్రచారానికి నిరసనగా డీఎస్సీ 2025లో ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులు ఆదివారం విజయవాడలో ఆత్మ గౌరవ ర్యాలీ నిర్వహించారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి వచ్చిన సుమారు 7వేల మంది ఉపాధ్యాయులు నగరంలో భారీ ర్యాలీ చేపట్టారు. ప్రతిభతో ఉద్యోగం సాధించిన తమపై వైసీపీ పార్టీ అసత్య ఆరోపణలతో తీవ్రంగా అవమానిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాల్లో జగన్మోహన్ రెడ్డిలా తమకు కారుణ్య నియామకం జరగలేదని.. ఎంతో కష్టపడి చదివితే ఉద్యోగం వచ్చిందని ధ్వజమెత్తారు. తల్లిదండ్రుల కళ్లలో ఆనందం కోసం నిద్రలు మానుకోని కష్టపడి చదివి టీచర్ కొలువులు సాధిస్తే.. నేడు వైసీపీ తమతో రాజకీయం చేయడం దారుణమన్నారు. టీచర్ కొలువు కోసం సంవత్సరాలు కొద్ది కుటుంబాలను దూరం చేసుకొని ఒక పూట భోజనం చేశామన్నారు. వైసీపీ నాయకుల విష ప్రచారంతో ఉద్యోగం వచ్చిన ఆనందం కూడా తమ కుటుంబాల్లో లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ నాయకులు కేవలం ఉపాధ్యాయులను మాత్రమే కాదు.. భారత అడ్మినిస్ట్రేషన్ వ్యవస్థనే అవమానిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులకు జ్ఞానం పంచే తమను ఇలా బలి చేయడం సరైనా పద్ధతి కాదని హితవు పలికారు. మెగా డీఎస్సీపై వైసీపీ నిందలు మానుకొని  నిజాలు తెలుసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో కొత్తగా వస్తోన్న మరో డీఎస్సీని అడ్డుకునేందుకు వైసీపీ కుట్రలు చేస్తోందని ఆరోపించారు. యువత వైసీపీ ట్రాప్ లో పడి ఆ పరీక్షకు ప్రిపరేషన్ ఆపొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల తల్లిదండ్రులు కొందరు పాల్గొన్నారు. ఎంతో కష్టపడి చదివి ఉద్యోగాలు పొందిన తమ బిడ్డలపై నిందలు మానుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు నగరంలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి అంబేద్కర్ స్మృతి వనం వరకు ఆత్మగౌరవ ర్యాలీ చేపట్టారు. వైసీపీ నాయకులకు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు.

ఎన్టీఆర్ జిల్లాకు చెందిన టీచర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ సమాజానికి విలువలు నేర్పుతున్న ఉపాధ్యాయులకు వైసీపీ నాయకులు మలినాలు అంటగట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. మా తల్లిదండ్రుల కళ్లలో ఆనందం కోసం 10ఏళ్లు కష్టపడి టీచర్ ఉద్యోగం సాధించా. 46 సంవత్సరాల వయస్సులో మూడు పీజీలు చేసిన నాకు ఉద్యోగం కనుక్కోవాల్సిన అవసరం ఏం ఉంది. మెగా డీఎస్సీ నోటిఫికేషన్ లో ఉపాధ్యాయులనే కాదు.. భారత అడ్మినిస్ట్రేషన్ వ్యవస్థనే వైసీపీ నాయకులు అవమానిస్తున్నారు. వైసీపీ హయాంలో గ్రూప్ 1 నియామకాల్లో జరిగిన కుంభకోణాన్ని కప్పిపుచ్చుకునేందుకు జగన్మోహన్ రెడ్డి డీఎస్సీపై ఆరోపణలు చేస్తున్నారు. వైసీపీ హయంలో జరిగిన గ్రూప్ 1 అవకతవకలపై అసెంబ్లీలో చర్చ జరగాలి. వర్టికల్, హారిజెంటల్ రిజర్వేషన్ల గురించి జగన్మోహన్ రెడ్డి అవగాహన పెంచుకోవాలి. మా కష్టాలను తెలుసుకొని డీఎస్సీ నోటిఫికేషన్ కు కృషి చేసిన నాయకులు నారా లోకేష్, చంద్రబాబు నాయుడు. ఉద్యోగం రాలేదని ఆరోపణలు చేస్తోన్న స్పోర్ట్స్ కోటాకు చెందిన అభ్యర్థులు వాళ్లు మొదట

(తరువాయి 3లో.. )





## వైసీపీకి తగిన బుద్ధి చెబుతాం!

# నిందలు మానుకో.. నిజం తెలుసుకో

(2వ పేజీ తరువాయి.. )




ఒక సర్టిఫికేట్స్ అప్ లోడ్ చేసి వెరిఫికేషన్ లో మరో సర్టిఫికేట్స్ చూపించారు. జగన్ రెడ్డి ఇదిగో డీఎస్సీ అదిగో డీఎస్సీ అంటూ ఊరించారు. ఐదేళ్లలో ఒక డిఎస్సీ నోటిఫికేషన్ కూడా విడుదల చేయని అసమర్థ నాయకుడు జగన్మోహన్ రెడ్డి. 2024 ఎన్నికల్లో విజయం సాధించిన కూటమి ప్రభుత్వం తక్కువ సమయంలోనే డిఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసిందన్నారు.

కృష్ణా జిల్లా ఆరుగొలనుకు చెందిన ఇంగ్లీష్ టీచర్ శ్వేత మాట్లాడుతూ.. మెగా డీఎస్సీ అంతా పారదర్శకంగా జరిగిందన్నారు. దీనిపై నిందలు వేసి మా వృత్తిని అవమానించద్దు. ఒక అబద్దాన్ని వంద సార్లు చెప్పి నిజం చేయాలని వైసీపీ పార్టీ కుట్రలు చేస్తోంది. కుటుంబాలకు దూరంగా ఉండి కళ్లలో ఒత్తులు వేసుకొని కష్టపడి చదివిన మాపై నిందలు వేయడం దారుణం. బావి భారత పౌరులను తయారు చేస్తున్న మాపై వైసీపీ నాయకులు బురద జల్లాలని చూస్తోంది. డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి 16వేల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం వెలుగులు నింపిందన్నారు.

పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు సూర్య మాట్లాడుతూ.. ఈ రోజు మేము ఎన్నో త్యాగాలు చేసి మరి సాధించుకున్న ఉద్యోగాలను తప్పు అంటున్నారు.. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణాన్ని అడ్డు పెట్టుకుని అధికారంలోకి వచ్చిన జగన్ కూడా తప్పుల గురించి మట్లాడుతున్నారా..అని మండిపడ్డారు. మీరు ఉపాధ్యాయుల పక్షాన నిలబడేలా అయితే... రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలపై పోరాటాలు చేయాలని సూచించారు.

గుంటూరు జిల్లాకు చెందిన శనగల చంద్రశేఖర్ మాట్లాడుతూ.. వయస్సు పరిమితి దాటిపోతున్న తనకు మెగా డీఎస్సీ 2025 ఆశ కిరణంలా నిలిచిందన్నారు. ఉపాధ్యాయునిగా స్థిరపడాలనే నా కలను నిజం చేసింది కూటమి ప్రభుత్వం. కంటి చూపు సరిగ్గా లేకున్నా నా కుటుంబానికి వెలుగులు నింపాలని కష్టపడి చదవి ఉద్యోగం సాధించా. రేయింబవళ్లు కష్టపడి ఉద్యోగం సాధిస్తే మాపై నిందలు వేస్తే బాధగా ఉంది. గురువులను అవమానించిన వాళ్లకు పుట్టగతులు ఉండవని స్పష్టం చేశారు.

తెనాలికి చెందిన పసుపులేటి చిరంజీవి మాట్లాడుతూ.. 16 వేల జీవితాల్లో కాదు.. 16 వేల కుటుంబాల్లో కూటమి ప్రభుత్వం వెలుగులు నింపిందన్నారు. ఉపాధ్యాయిని గౌరవాన్ని పెంచిన కూటమి ప్రభుత్వానికి మనమందరం రుణపడి ఉండాలి. అలానే ఇది మెగా డీఎస్సీ కాదు.. దగా డిఎస్సీ అని బురద జల్లుతున్నారు కాబట్టి, దానిని వ్యతిరేకించాల్సిన అవసరం కూడా మన మీద ఉంది. ఇది దగా డీఎస్సీ కాదు.. ఇది మెగా డీఎస్సీ.. కష్టపడి మేము సాధించుకున్న మా హక్కు." అని అన్నారు.

కృష్ణా జిల్లా బాపులపాడుకి చెందిన సుమలత మాట్లాడుతూ.. ఐదేళ్ల కాలంలో ఒక్క జాబ్ కూడా ఇవ్వని జగన్ ఇవాళ డీఎస్సీ గురించి మాట్లాడటం సిగ్గు చేటులా అనిపించలేదా అని నిలదీశారు. ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న మన రాష్ట్రంలో ఇలాంటి అసత్య ఆరోపణలు మంచిది కావు. రాష్ట్ర అభివృద్ధిలో వైసీపీ భాగం కావాలి గానీ.. ఇలా ఆరోపణలు చేస్తూ అభివృద్ధికి అడ్డంకిగా మారకూడదు. సమాజ నిర్మాణంలో మేము ముఖ్య భూమిక పోషిస్తున్నాం. మాకు ఆత్మ సాక్షి ఉంటుంది.. మాపై నిందలు మానుకోవాలి. సరాసరిగా అందరం 40 ఏళ్ల వయస్సులో ఉద్యోగాలు సాధించాం. రూ.25లక్షలకు జాబ్ కొనుక్కునే స్థోమత ఉంటే ఇన్ని రోజులు సమయం వృధా చేస్తామా. పిల్లలను, కుటుంబాలను దూరం పెట్టి ఉద్యోగాలు సాధించాం.. మాపై నిందలు వేయడం సరికాదని హితవు పలికారు.

పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు గోపాల్ మాట్లాడుతూ.. 2019-24 మధ్య కాలంలో డీఎస్సీ నోటిఫికేషన్ గురించి వేయి కళ్లతో ఎదురు చూసినా ఫలితం లేకపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 16 వేల పోస్టులను భర్తీ చేసి ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకుంది. కూటమి ప్రభుత్వం ఇంత పారదర్శకంగా నిర్వహించిన మెగా డీఎస్సీపై ఏ మొహం పెట్టుకుని విమర్శలు చేస్తున్నారో మిమ్మల్ని మీరే ప్రశ్నించుకోవాలి. కూటమి ప్రభుత్వానికి డీఎస్సీ అభ్యర్థులందరూ కూడా జీవితాంతం రుణపడి ఉంటామని పేర్కొన్నారు.

గుంటూరు జిల్లాకు చెందిన ఉపాధ్యాయురాలు దుర్గాదేవి మాట్లాడుతూ.. తమను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్న వారికి ఇక్కడే నిలబడి సమాధానం చెప్పాం .. తాము విజయం సాధించినట్లేనన్నారు దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సరే బ్రిటిష్ వారు పాటించిన విభజించి పాలించు అనే సూత్రాన్ని ఇంకా అనుసరిస్తునే ఉన్నారు. మనం ఎంత కష్టపడ్డామో... ఎన్ని వదులుకున్నామో.. మనకి మాత్రమే తెలుసునని ఆవేదన వ్యక్తం చేశారు.

ర్యాలీ చివర్లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించడం ద్వారా ఉపాధ్యాయ వృత్తి గౌరవాన్ని కాపాడాలనే తమ డిమాండ్‌ను స్పష్టం చేశారు. వైసీపీ విష ప్రచారానికి వ్యతిరేకంగా ఇప్పటికే కర్నూలు, తిరుపతి సహా పలు జిల్లాల్లో డీఎస్సీ విజేతల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించిన విషయం తెలిసిందే.





# సభా పర్వం

## - నేటి నుంచే అసెంబ్లీ సమావేశాలు -

- రాజధానిలో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం
- ఏఐ సాయంతో ఇన్విజిబుల్ పోలీసింగ్
- కీలక అంశాలపై చర్చించే అవకాశం
- గ్రూప్1లో అక్రమాలపై నిలదీతకు
- సిద్ధమైన అధికార పక్షం సభ్యులు
- మెగా డీఎస్సీపైనా స్ట్రాంగ్ కౌంటర్
- స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల బిల్లు
- తీసుకొచ్చే యోచనలో ప్రభుత్వం




అమరావతి(చైతన్యరథం): ఏపీ శాసనసభ వర్షాకాల సమా వేశాలు సోమవారం నుంచి నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. దీనికోసం భద్రతను కట్టుదిట్టం చేశారు. ఏఐ సాయంతో ఇన్విజిబుల్ పోలీసింగ్ నిర్వహించనున్నారు. నాలుగు రోజుల పాటు ఈ సమావేశాలు నిర్వహించే ఆలోచనలో ప్రభు త్వం ఉంది. తొలుత అసెంబ్లీలో ప్రశ్నోత్తరాలు నిర్వహించి ఆ తర్వాత వాయిదా అనంతరం బీఏసీ సమావేశం నిర్వహించే అవకాశం ఉంది. ఈ సమావేశంలో సభను ఎన్నిరోజులు నిర్వ హించాలి, ఏ సమయం నుంచి ఏ సమయం వరకు నిర్వహిం చాలి అనే దానిని చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ప్రశ్నోత్తరాల్లో 10 ప్రశ్నలకు సంబంధించి అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. అమరావతిలో మౌలిక సదుపాయాల కల్పన, విద్యుత్ సంస్థలకు భూకేటాయింపులు, ఇతరత్రా నియోజకవర్గా లకు సంబంధించి ప్రశ్నలు రానున్నాయి. దానికి సంబంధించి సంబంధిత మంత్రులు సమాధానాలు చెప్పనున్నారు.

### మొదటిరోజు ఐదు బిల్లులపై చర్చ

మొదటిరోజు ఐదు బిల్లులపై చర్చ జరిగే అవకాశం ఉంది. 18న రెండోరోజు రాష్ట్రంలో తాజా పరిణామాలకు సంబంధించిన అంశాలపై లఘు చర్చ చేపట్టి సభను కొనసాగించనున్నారు. వ్యవసాయం, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ఎల్‌నినో పరిస్థితులపై చర్చించి అందుకు తగ్గ కార్యాచరణ చేపట్టేందుకు సిద్ధమవుతోంది.

### బీసీ రిజర్వేషన్లపై కీలక చర్చ

ఈ నెల 19న శాసనసభ సమావేశాల మూడోరోజు బీసీ రిజ ర్వేషన్లు, బీసీ రక్షణ చట్టానికి సంబంధించి చర్చకు వచ్చే అవకా శం ఉంది. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించే అంశా నికి సంబంధించి చట్టం తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే డెడికేటెడ్ కమిషన్ ఇచ్చిన నివేదికను మంత్రివర్గ సమా వేశంలో పెట్టి దానిని ఆమోదించిన తర్వాత దీనిని శాసనసభలో పెట్టాలన్న ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇందుకు అనుగు ణంగా అదేరోజు ముఖ్యమంత్రి కార్యాలయంలోనే మంత్రివర్గ సమావేశం పెట్టి ఆమోదం తీసుకుని సభలో తీర్మానం రూపంలో పెట్టాలా లేక బిల్లు రూపంలో తీసుకురావాలా అన్నది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

### శాంతిభద్రతలు, నీరుపారుదల ప్రాజెక్టులు

ఈ నెల 20వ తేదీన చివరి రోజు రాష్ట్రంలో శాంతిభద్రతలు, నీటి పారుదలకు సంబంధించి చర్చకు వచ్చే అవకాశం ఉంది. రాజకీయ ముసుగులో అసాంఘిక శక్తులతో చేయిస్తున్న కార్యక్ర మాలను ఎలా నియంత్రించాలి, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించే అవకాశం ఉంది. అలాగే ఇక సూపర్‌సిక్స్ అమలు, రెండేళ్లలో అభివృద్ధి- సంక్షేమం, రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులు అంశంపై చర్చ జరిగే అవకాశం ఉంది. అలాగే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల టవర్లు పూర్తయిన నేపథ్యంలో వారికి ఏ విధంగా ఫ్లాట్లు కేటా యించాలి అన్న దానిపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

### గ్రూప్1 అక్రమాలపై నిలదీతకు సిద్ధం

ప్రతిపక్ష హోదా ఇస్తేనే సభకు వస్తామంటూ కుంటి సాకులు చెబుతూ వస్తోన్న వైసీపీ సభ్యులు సభకు వస్తే గత ప్రభు త్వంలో గ్రూప్ 1లో జరిగిన అక్రమాలపై అధికార పక్షం నిలదీసేందుకు సిద్ధమవుతోంది. అంతేకాకుండా మెగా డీఎస్సీపై చేస్తున్న దుష్ప్ర చారంపై సాక్ష్యాధారాలతో స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చేందుకు సిద్ధమైంది. అయితే అసెంబ్లీ సమావేశాలకు వారు వస్తారా రారా అన్నది తెలియాల్సి ఉంది. ఎమ్మెల్సీలు మాత్రం తమకున్న బలం ఆధా రంగా మండలిలో ప్రభుత్వంపై బురదజల్లి ఇరుకున పెట్టాలని చూస్తోంది. ఇందుకు అధికారపక్షం కూడా తగిన వ్యూహంతోనే ఉంది. ప్రభుత్వంపై బురదజల్లి వెళ్లిపోకుండా వారికి సభలోనే ఆయా అంశాలపై అన్ని వాస్తవాలు బహిర్గతం చేయాలని భావిస్తోంది.

### సభకొస్తే సమాధానాలిప్పిస్తా: స్పీకర్

జగన్‌రెడ్డి అసెంబ్లీకొస్తే డీఎస్సీతో సహా పలు అంశాలపై సమా ధానాలు ఇప్పించే బాధ్యత తీసుకుంటానని స్పీకర్ అయ్యన్న పాత్రుడు సూచించారు. రోడ్లపైకి వచ్చి మాట్లాడే బదులు సభకు వచ్చి ప్రశ్నించాలని తెలిపారు. అర్హత లేకుండా ప్రతిపక్ష హోదా ఎలా ఇవ్వగలమని పేర్కొన్నారు. శాసనసభ వర్షాకాల సమావే శాలకు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఎమ్మెల్యేగా జగన్‌తో సహా 11 మంది సభకు రావాల్సిన బాధ్యత ఉందని తెలిపారు.

---

రూ.15 లక్షల లంచం తీసుకుంటూ

## సీబీఐకి చిక్కిన రైల్వే ఇంజినీర్

విజయవాడ(చైతన్యరథం): నగరంలో సీబీఐ అధికారులు నిర్వ హించిన ట్రాప్ ఆపరేషన్‌లో రూ.15 లక్షల లంచం తీసుకుంటూ సీనియర్ సెక్షన్ ఇంజినీర్ బాపిరాజు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఆయనతో పాటు ప్రైవేట్ వ్యక్తి శ్రీచంద్‌ను కూడా సీబీఐ అరెస్ట్ చేసింది. రూ.179.50 కోట్ల విలువైన ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ పనుల ప్రాజెక్టులో ముందస్తుగా పనులు పూర్తి చేసినం దుకు రూ.7 కోట్ల బోనస్ క్లెయిమ్ చేసిన జాయింట్ వెంచర్ సంస్థకు బోనస్ మంజూరు, విడుదల విషయంలో సహకరించేందుకు రూ.15 లక్షల లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. బోనస్ మంజూరుకు అనుకూలంగా ఫైల్ తేదీలను మార్చినట్లు కూడా సీబీఐ దర్యాప్తులో వెల్లడైనట్లు సమాచారం. గణపతి ఇంజినీరింగ్ వర్క్స్, యెల్లా కన్‌స్ట్రక్షన్స్ జాయింట్ వెంచ ర్‌కు సంబంధించిన వ్యవహారంలో ప్రైవేట్ కంపెనీ ఎండీ కుమా రుడి ద్వారా లంచం చెల్లించినట్లు సీబీఐ వెల్లడించింది. విశాఖ పట్నం నుంచి విజయవాడకు వచ్చి లంచం అందజేస్తుండగా రూ.15 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం విశాఖ పట్నం, విజయవాడ, పిఠాపురం, హైదరాబాద్‌లోని నిందితుల ప్రాంగణాల్లో సీబీఐ సోదాలు నిర్వహిస్తోంది. ఈ వ్యవహారంలో మరికొందరి పాత్రపైనా దర్యాప్తు కొనసాగుతోంది. నిందితులను రెపు విజయవాడ కోర్టులో హాజరుపరచనున్నట్లు సీబీఐ తెలిపింది.

---

**గౌతు లచ్చన్నకు నివాళి**

స్వాతంత్ర్య సమరయోధులు సర్దార్ గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



చైతన్యరథం




# నేటి నుంచే భోగాపురం సేవలు

- ఉదయం నుంచి విమాన రాకపోకలు ప్రారంభం
- తొలిరోజు 31 సర్వీసులు నడిపేందుకు సిద్ధం
- విశాఖ నుంచి నిలిచిపోనున్న సర్వీసులు
- అక్కడి ప్రయాణికుల కోసం ఎలక్ట్రిక్ బస్సు
- స్థానికులకు కనువిందు చేయనున్న విమానాలు



విజయనగరం (చైతన్యరథం): భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం సోమవారం తెల్లవా రుజాము నుంచే ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది. వాణిజ్యపరమైన విమాన రాకపోకలు ప్రారంభం కానున్నాయి. సుమారు 30 విమానాల వరకు ప్రతిరోజూ రాకపోకలు సాగించ నున్నాయి. భోగాపురం నుంచి హైదరాబాద్, విజయవాడ, ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, కలకత్తా, ముంబై, తిరుపతి ప్రాంతాలతో పాటు విదేశాలైన సింగపూర్, అబుదాబీ వంటి ప్రాంతాలకు విమాన ప్రయాణం చేయవచ్చు. అంచెలంచెలుగా మరిన్ని అంత ర్జాతీయ విమాన సర్వీసులు పెరగనున్నాయి. ఇదిలా ఉండగా భోగాపురం ఎయిర్‌పోర్టులో ట్రయల్‌రన్ నిర్వహించినప్పటి నుంచే కొన్ని విమానాల రాకపోకలు సాగుతున్నాయి. ఈనెల 1న ప్రధాని నరేంద్రమోదీ ఎయిర్‌పోర్టు ప్రారంభించిన తరువాత సుమారు 10 వరకు విమానాలు వచ్చి వెళ్లాయి. అయితే ఈనెల 16న అర్ధరాత్రి 12 గంటలు దాటాక పూర్తిస్థాయిలో అధికారికంగా విమానాలు రాక పోకలు సాగించనున్నట్లు విమానయాన శాఖ ఇప్పటికే ప్రకటిం చింది. విశాఖ నుంచి వచ్చే ప్రయాణికులకు ఇబ్బందులు లేకుం డా ప్రతి అరగంటకు ఒక ఎలక్ట్రిక్ బస్సును ఏర్పాటు చేశారు. ట్రయల్‌రన్ కూడా నిర్వహించారు. ఇప్పటికే భోగాపురం ఎయిర్ పోర్టుకు వెళ్లేందుకు జాతీయ రహదారి-16తో అనుసంధానంగా అప్రోచ్ రోడ్లను నిర్మించారు. అలాగే పెందుర్తి, జేవీ అగ్రహారం నుంచి తాళ్లవలస, కొమ్మాది నుంచి బొయపాలెం మీదుగా కాపులుప్పాడ, మంగమారిపేటకు అను సందానంగా ఉన్న తిమ్మాపురం రహదారికి ఎయిర్‌పోర్టు రోడ్డుతో కనెక్టవిటీ ఉంది. దీంతో ఎయిర్‌పోర్టుకు వచ్చే ప్రయాణి కులు, వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వం మార్గం సుగమం చేసింది.

### భోగాపురంలో సౌకర్యాలు ఇవే

భోగాపురం అల్లూరి సీతారామరాజు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో ప్రయాణికులకు డొమెస్టిక్ లాంజ్, అంతర్జాతీయ ప్రయాణికులకు ఇంటర్నేషనల్ లాంజ్ ఏర్పాటు చేశారు. సెల్ఫ్ బ్యాగేజ్ డ్రాప్, స్మార్ట్ ట్రాలీలు, హై స్పీడ్ వైఫై, మెడికల్ సర్వీస్, బేబీ కేర్, ఏటీఎం/కరెన్సీ ఎక్ఛ్సేంజ్ వంటి సేవలు అందుబాటులో ఉన్నాయి.

### హైదరాబాద్‌కు తొలి విమానం

వాస్తవానికి భోగాపురం నుంచి సింగపూర్‌కు తొలి విమానం ఈనెల 16న బయలుదేరుతుందని అనుకున్నారు. కానీ, ఈనెల 17న ఉదయం సర్వీసులు ప్రారంభించాలని నిర్ణయించారు. ఇప్పటికే భోగాపురం నుంచి హైదరాబాద్, ఢిల్లీ, ముంబయి, చెన్నై, బెంగళూరు, కోల్‌కతా, తిరుపతికి ఇండిగో సంస్థ తొలి రోజు 31 సర్వీసులు నడపడానికి ప్రణాళిక రూపొందించింది. భోగాపురం లోని అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రాకపోకలపై విమాన యాన సంస్థలు ఒక్కొక్కటిగా తమ షెడ్యూళ్లను విడుదల చేస్తు న్నాయి. ఈ నెల 16న అర్ధరాత్రి విశాఖ ఎయిర్‌పోర్ట్ సేవలు రద్దు కానుండగా.. అక్కడి నుంచి సేవలందించే విమానాలన్నీ భోగాపురం నుంచి వెళ్లనున్నాయి.

### భోగాపురం నుంచి బయలుదేరే సర్వీసులు

భోగాపురం నుంచి హైదరాబాద్‌కు ఈ నెల 17న ఉదయం 8.55, 10.40, మధ్యాహ్నం ఒంటిగంట, సాయంత్రం 4.25, రాత్రి 7.20, 8.40, 9.20 గంటలకు బయలుదేరనున్నాయి. ఢిల్లీకి ఉదయం 8.20, రాత్రి 10.45, బెంగళూరుకు మధ్యాహ్నం 2.55, రాత్రి 9.10, చెన్నైకి మధ్యాహ్నం 12.15, సాయంత్రం 6.35. కోల్‌కతాకు రాత్రి 7.50, ముంబయికి మధ్యాహ్నం 3.05, తిరుపతికి మధ్యాహ్నం 1.50 గంటలకు విమానాలు ప్రారంభ మవుతాయని పేర్కొంది.

### విశాఖ నుంచి నిలిచిపోనున్న సేవలు

విశాఖ విమానాశ్రయం సేవలు ఆదివారం అర్ధరాత్రి నుంచి సమాప్తం కానున్నాయి. విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మిం చిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నుం చి ఆగస్టు 17 నుంచి విమాన రాకపోకలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో విశాఖపట్నం విమానాశ్రయం నుంచి షెడ్యూల్ విమా నాలను నిలిపేస్తున్నట్లు పౌరవిమానయానశాఖ ఇప్పటికే ప్రకటిం చింది. 30 ఏళ్ల పాటు విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్ (ఐఎన్ఎస్ డేగ) సివిల్ ఎన్‌క్లేవ్ నుంచి షెడ్యూల్డ్ కమర్షియల్ విమానాల రాక పోకలను నిలిపేస్తున్నట్లు తెలిపింది. జాతీయ అత్యవసర పరిస్థితు ల్లో ఈ నిబంధనకు మినహాయింపు ఉంటుందని పేర్కొంది. భారతీయ వాయుసేన, సాయుధ దళాలు, పోలీసు విమానాలు, ప్రభుత్వ అతిథులు రాకపోకలు సాగించే విమానాలు, లీజ్, వీఐపీ ఎయిర్ క్రాఫ్టులు ఇక్కడి నుంచి నడుస్తాయని.. నాన్ షెడ్యూల్డ్ వాణిజ్య కార్యకలాపాలూ కొనసాగుతాయని పేర్కొంది. ఇప్పటి వరకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు ఉన్న అంతర్జాతీయ ట్రావెల్ కోడ్ 'వీటీజెడ్' ఆగస్టు 17న తెల్లవారుజామున 00:01 గంటల నుంచి అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయానికి బదిలీ అవుతుందని కేంద్రం తెలిపింది.

# చివరి శ్వాస వరకు బలహీన వర్గాల కోసమే శ్రమించిన యోధుడు

**- సర్దార్ గౌతు లచ్చన్నకు మంత్రి కందుల దుర్గేష్ నివాళి**

రాజమహేంద్రవరం (చైతన్యరథం): బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న 117వ జయంతి వేడుకల్లో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇందులో భాగంగా రాజమహేంద్రవరం వై-జంక్షన్ వద్ద ఉన్న గౌతు లచ్చన్న విగ్రహానికి ఆదివారం పూలమాలలు వేసి మంత్రి దుర్గేష్ ఘనంగా నివాళు లర్పించారు. స్ఫూర్తిదాయకమైన ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనమని, ఆయన అడుగుజాడల్లో నడుద్దామని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ తర్వాత "సర్దార్" అనే ప్రజా బిరుదు పొందిన మహనీయుడు గౌతు లచ్చన్న అని కొనియాడారు. 1932లో ఉప్పు సత్యాగ్రహం, శాసనోల్లంఘన ఉద్యమాల్లో పాల్గొని జైలు శిక్ష అనుభవించారని, స్వాతంత్ర్య సంగ్రామంలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. స్వాతంత్ర్యానికి ముందు, ఆ తర్వాత తెలుగునాట రాజకీయాలను తీవ్రంగా ప్రభావితం చేసిన అరుదైన నాయకుడు గౌతు లచ్చన్న అని తెలిపారు. పార్టీలకు అతీతంగా, చివరి శ్వాస వరకు వెనుకబడిన వర్గాల అభ్యున్నతి, సంక్షేమం కోసం ఆయన నిరంతరం శ్రమించారని వెల్లడించారు. వికేంద్రీకరణ, చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు ఆయన ఆనాడే బలమైన మద్దతు తెలిపారని పేర్కొన్నారు. గౌతు లచ్చన్న జయంతిని రాష్ట్ర అధికారిక కార్యక్రమంగా నిర్వహించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. చారిత్రాత్మక రాజమండ్రి నగరంలో ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించిన కమిటీ సభ్యులను అభినందించారు.

ఈ కార్యక్రమంలో గౌడ, శెట్టిబలిజ, ఈడిగ, శ్రీశైన, యాత సంక్షేమ సంఘం, విగ్రహ ఆవిష్కరణ కమిటీ గౌరవ అధ్యక్షుడు బుడ్డిగ శ్రీనివాస్, అధ్యక్షులు రెడ్డి రాజు, ఇతర ప్రతినిధులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# రైతుకు మేలు జరిగితే సాక్షికి కడుపుమంట ఎందుకు?

- **పంటల బీమాపై తప్పుడు ప్రచారంతో రైతులను తప్పుదోవ పట్టించొద్దు**
- **ఎల్‌నినో ముప్పు నేపథ్యంలో ప్రతి రైతుకూ బీమా రక్షణే ప్రభుత్వ లక్ష్యం**
- **ఖరీఫ్-2026లో బీమా దరఖాస్తులు 35.17 లక్షలు.. 80 శాతం పెరుగుదల**
- **బీమా విస్తీర్ణంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌కు 5వ స్థానం**
- **గత ప్రభుత్వం పెట్టిన రూ.1,990 కోట్ల ప్రీమియం బకాయిలపై సాక్షి ఎందుకు మాట్లాడదు?**
- **రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మండిపాటు**

అమరావతి (చైతన్యరథం): రైతులకు మేలు చేయాలనే సదుద్దేశంతో కూటమి ప్రభుత్వం పెద్దఎత్తున పంటల బీమా నమోదు చేపడితే దానిని కూడా వక్రీకరిస్తూ సాక్షి పత్రిక తప్పుడు ప్రచారం చేయడం దురదృష్టకరమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మండిపడ్డారు. అవాస్తవాలతో రైతుల్లో అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుకు మేలు జరిగితే ఓర్వలేని ధోరణితో వార్తలు రాయడం



మానుకోవాలని హితవు పలికారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం, అనిశ్చిత వర్షపాతం ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో ఏ ఒక్క రైతు కూడా నష్టపోకూడదనే లక్ష్యంతోనే ప్రభుత్వం పంటల బీమాపై ప్రత్యేక దృష్టి పెట్టిందని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రతి రైతును ప్రత్యక్షంగా సంప్రదించడంతో పాటు రైతు సేవా కేంద్రం, క్లస్టర్, రైతువారీగా అర్హుల వివరాలను మ్యాపింగ్ చేశామని తెలిపారు. బీమా పరిధిలోకి రాని అర్హులైన రైతులను గుర్తించి జూలై 29 నుంచి 31 వరకు ప్రత్యేక పంటల బీమా నమోదు కార్యక్రమం నిర్వహించామని చెప్పారు. ఇది సిబ్బందిపై ఒత్తిడి కాదని, అర్హులైన ప్రతి రైతుకూ బీమా రక్షణ కల్పించాలనే బాధ్యతాయుతమైన చర్య అని స్పష్టం చేశారు.

పంటల బీమా నమోదు పూర్తిగా రైతుల సమ్మతి, వారి ఇష్టప్రకారమే జరిగిందని, ఎవరినీ బలవంతంగా నమోదు చేయలేదని మంత్రి తేల్చిచెప్పారు. బీమా గడువు ముగిసిన తర్వాత నమోదు చేసుకునే అవకాశం ఉండదని, అందుకే పంట సాగుకు అవకాశం ఉన్న ప్రాంతాల్లోని రైతులకు ముందుగానే అవగాహన కల్పించి బీమా తీసుకునే అవకాశాన్ని ప్రభుత్వం అందించిందన్నారు. బీమా చేసిన మొత్తంలో రైతు చెల్లించాల్సిన ప్రీమియం కేవలం 0 నుంచి 2 శాతం మాత్రమేనని, మిగిలిన ప్రీమియాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తాయని అచ్చెన్నాయుడు వివరించారు. కొన్ని జిల్లాల్లో ఎకరాకు రైతు చెల్లించాల్సిన ప్రీమియం చూస్తేనే ప్రభుత్వం రైతులపై ఎంత తక్కువ భారం పెడుతోందో అర్థమవుతుందన్నారు. వరి.. కోనసీమ జిల్లాలో రూ76, సజ్జ.. కర్నూలు జిల్లాలో రూ.32, మినుము: కడప జిల్లాలో రూ.38, వేరుశనగ.. నెల్లూరు జిల్లాలో రూ.280, జొన్న: కడప/కర్నూలు జిల్లాల్లో రూ.35, మొక్కజొన్న: కర్నూలు/శ్రీకాకుళం జిల్లాల్లో రూ.66, కంది: కడప జిల్లాలో రూ.36, ఉల్లి: కడప/కర్నూలు జిల్లాల్లో రూ.90, మిరప: కర్నూలు/పల్నాడు జిల్లాల్లో రూ.360 మాత్రమే రైతు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. క్లస్టర్, జిల్లా, పంట, బీమా కంపెనీని బట్టి ప్రీమియంలో స్వల్ప వ్యత్యాసం ఉండవచ్చని పేర్కొన్నారు.

ఎల్‌నినో ప్రమాదం ఇప్పటికే స్పష్టంగా ఉండటంతో గడువుల పొడిగింపునకు బీమా కంపెనీలు తొలుత సుముఖత చూపకపోయినా, ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వం, బీమా సంస్థలతో మాట్లాడి రైతుల ప్రయోజనాల కోసం గడువులను పొడిగించేలా కృషి చేశారని తెలిపారు. వాతావరణ ఆధారిత RWBCIS గడువును జూలై 15 నుంచి జూలై 31 వరకు, దిగుబడి ఆధారితప్రీవీఫీద్ గడువును జూలై 31 నుంచి ఆగస్టు 15 వరకు పొడిగించామని చెప్పారు. అంతేకాకుండా PMFBY నమోదును ఆగస్టు 31 వరకు మరింత పొడిగించాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించామని, నమోదు వివరాలను పూర్తి చేసేందుకు బ్యాంకులకు అదనంగా 15 రోజుల సమయం ఇచ్చినట్లు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక చర్యల ఫలితంగానే ఖరీఫ్--2026లో పంటల బీమా నమోదు రికార్డు స్థాయికి చేరిందని మంత్రి తెలిపారు. ఖరీఫ్-2025లో 19.50 లక్షలుగా ఉన్న నమోదు దరఖాస్తులు ఖరీఫ్-2026లో 35.17 లక్షలకు పెరిగాయని, ఇది సుమారు 80 శాతం పెరుగుదల అని చెప్పారు. ముఖ్యంగా రుణాలు తీసుకోని రైతుల నమోదు 2.00 లక్షల నుంచి ఏకంగా 20.35 లక్షలకు పెరిగిందన్నారు. బీమా విస్తీర్ణం 7.83 లక్షల హెక్టార్ల నుంచి 15.17 లక్షల హెక్టార్లకు, అంటే సుమారు 94 శాతం పెరిగిందని వెల్లడించారు. మొత్తం రూ.13,983 కోట్ల బీమా మొత్తం నమోదైందని, బీమా విస్తీర్ణంలో ఆంధ్రప్రదేశ్ దేశంలో 5వ స్థానంలో నిలిచిందని తెలిపారు.

రైతులకు పరిహారం అందడం లేదంటూ ఇప్పుడు విమర్శలు చేస్తున్న వారు గత ప్రభుత్వ హయాంలో చెల్లించాల్సిన సుమారు రూ.1,990 కోట్ల ప్రీమియం బకాయిలపై ముందుగా సమాధానం చెప్పాలని అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ బకాయిల కారణంగానే రైతులకు రావాల్సిన బీమా పరిహారం నిలిచిపోయిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతుల ఇబ్బందులను గుర్తించి గత ప్రభుత్వం పెట్టిన బకాయిలను కూడా దశలవారీగా చెల్లించేందుకు చర్యలు చేపట్టిందని తెలిపారు. అదే విధంగా ఖరీఫ్-2025కు సంబంధించిన ప్రభుత్వ ప్రీమియాన్ని చెల్లించడంతో రైతుల ఖాతాల్లో బీమా పరిహారం జమయ్యే ప్రక్రియ ప్రారంభమైందని వెల్లడించారు. ఎల్‌నినో నేపథ్యంలో ఏ ఒక్క రైతు కూడా నష్టపోకూడదు.. అత్యంత తక్కువ ప్రీమియంతో గరిష్ఠ బీమా రక్షణ కల్పించాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యం. రైతులకు మేలు జరుగుతుంటే అభినందించాల్సింది పోయి వాస్తవాలను వక్రీకరించి అపోహలు సృష్టించడం రైతు వ్యతిరేక ధోరణి. సాక్షి ఎన్ని తప్పుడు కథనాలు రాసినా గణాంకాలు, వాస్తవాలే కూటమి ప్రభుత్వ రైతు సంక్షేమ నిబద్ధతకు నిదర్శనం అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# ఆస్తుల కంటే చేసిన సాయమే శాశ్వతం

**- విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా ఉచితంగా సైకిళ్ల పంపిణీ**

**- మంత్రి నిమ్మల రామానాయుడు**

యలమంచిలి (చైతన్యరథం): జీవితంలో మనం సంపాదించే ఆస్తిపాస్తుల కంటే సమాజానికి చేసే మంచి పనులే శాశ్వతంగా నిలిచిపోతాయని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు దశలవారీగా ఉచిత సైకిళ్లు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

యలమంచిలి మండలం వైవీ లంక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం విశాఖపట్నానికి చెందిన దేవి ఫిషరీస్ సీఎస్ఆర్ నిధులతో 244 మంది విద్యార్థినీ విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను మంత్రి రామానాయుడు, దేవి ఫిషరీస్ ఎండీ సురేందర్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తన పరిచయాలను స్వార్థ ప్రయోజనాలకు, కుటుంబ అవసరాలకు కాకుండా నియోజకవర్గ ప్రజలకు ఉపయోగపడేలా వినియోగిస్తున్నానని చెప్పారు.

### ప్రతి ప్రభుత్వ పాఠశాల విద్యార్థికీ సైకిల్

పాలకొల్లు నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు దశలవారీగా




ఉచిత సైకిళ్లు అందించాలన్నది తన లక్ష్యమన్నారు. ఇందుకోసం వివిధ సంస్థల నుంచి సీఎస్ఆర్ నిధులు సమీకరిస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలు దూరంగా ఉండటం వల్ల విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తగ్గించడంతో పాటు, వారు సకాలంలో పాఠశాలలకు చేరుకునేందుకు సైకిళ్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు.

సీఎస్ఆర్ నిధులతో నియోజకవర్గంలోని శ్మశానవాటికలను కూడా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వ నిధులతో పాటు సీఎస్ఆర్ నిధులను కూడా సమర్థంగా వినియోగించుకుంటున్నామన్నారు.

### అందరికీ 'తల్లికి వందనం'

కూటమి ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి రామానాయుడు అన్నారు. 'తల్లికి వందనం' పథకం ద్వారా కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంతమందికీ ఒక్కొక్కరికి రూ.13 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 67.47 లక్షల మంది విద్యార్థులకు రూ.10,120 కోట్లను వారి తల్లుల ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. ఈ పథకం ద్వారా బడి మానేసిన పిల్లలు తిరిగి పాఠశాలల వైపు వస్తున్నారని పేర్కొన్నారు.

గత ప్రభుత్వ హయాంలో విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉన్నా అందరికీ 'తల్లికి వందనం' ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కరికే అమలు చేశారని ఆరోపించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా నిర్వీర్యం చేసి పేద విద్యార్థులకు అన్యాయం చేశారని విమర్శించారు.

### 16 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగంలో భారీగా నియామకాలు చేపట్టిందని మంత్రి తెలిపారు. గత ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టును కూడా భర్తీ చేయని గత ప్రభుత్వం.. నేడు డీఎస్సీ ద్వారా 16 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశామని చెప్పారు. ఉపాధ్యాయ నియామకాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవతో రాష్ట్రంలో విద్యారంగానికి కొత్త ఊపిరి వచ్చిందన్నారు.

### అభివృద్ధి-సంక్షేమమే ధ్యేయం

గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసి వెంటిలేటర్‌పైకి నెట్టారని మంత్రి విమర్శించారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలోనే ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూ మరోవైపు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమాంతరంగా అమలు చేస్తోందన్నారు.

పాలకొల్లు నియోజకవర్గంలో రహదారులు, డ్రైనేజీలు, సాగునీటి కాలువలు, ప్రభుత్వ ఆసుపత్రులు, విద్యాసంస్థలు, పార్కులు, తాగునీరు తదితర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. ప్రజలకు అవసరమైన ప్రతి సమస్యను గుర్తించి పరిష్కరించేందుకు నిరంతరం పనిచేస్తున్నామని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారం, విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా, పేదల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి.. ఈ నాలుగు అంశాలే తనకు ప్రధాన లక్ష్యాలని మంత్రి రామానాయుడు స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విశాఖపట్నం దేవి  ఫెసిరీస్ ఎండి సురేందర్ ను మంత్రి రామానాయుడు ఘనంగా సత్కరించారు. ముందుగా మంత్రి రామానాయుడు, సురేంద్ర లకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు.

# ఉత్తరాంధ్ర ముద్దుబిడ్డ.. బడుగుల బాంధవుడు గౌతు లచ్చన్న

- లచ్చన్న పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శం
- ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయం
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



విజయవాడ (చైతన్యరథం) బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం జీవితాంతం అలుపెరగని పోరాటం చేసిన స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కొనియాడారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన సర్దార్ గౌతు లచ్చన్న రాష్ట్ర స్థాయి జయంత్యోత్సవంలో పాల్గొన్న మంత్రి అచ్చెన్నాయుడు ఆయనకు ఘన నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడటమే కాకుండా, స్వాతంత్ర్యానంతరం బడుగు, బలహీన వర్గాలు, బీసీలు, రైతులు, కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం గౌతు లచ్చన్న చేసిన పోరాటాలు చిరస్మరణీయమని మంత్రి పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర ముద్దుబిడ్డగా ఈ ప్రాంతానికే కాకుండా రాష్ట్రానికి, దేశానికి ఆయన చేసిన సేవలు గర్వకారణమన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, సామాజిక న్యాయం, అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం జీవితాంతం పోరాడిన లచ్చన్న ఆశయాలు నేటి తరానికి మార్గదర్శకమని తెలిపారు.

బీసీలకు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా సముచిత స్థానం కల్పించాలన్న లచ్చన్న ఆశయాలకు అనుగుణంగానే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. బీసీలు అన్ని రంగాల్లో ఎదగాలంటే విద్య అత్యంత కీలకమని, ప్రతిభ ఉన్న విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తే వారు మరింత ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అనగాని సత్యప్రసాద్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గౌడ సామాజిక వర్గానికి చెందిన టెన్త్, ఇంటర్‌లో ప్రతిభ చాటిన 125 మంది విద్యార్థులకు రూ.25 లక్షల నగదు పురస్కారాలు అందించడం అభినందనీయమని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ప్రతిభను గుర్తించి విద్యార్థులను ప్రోత్సహించడం అంటే వారి భవిష్యత్తుకు భరోసా ఇవ్వడమేనని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు ఎదిగి కుటుంబానికి, సమాజానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రతిభావంతులైన విద్యార్థులకు మంత్రి అచ్చెన్నాయుడు నగదు పురస్కారాలను అందజేసి అభినందించారు.

బడుగు, బలహీన వర్గాల కోసం జీవితాన్ని అంకితం చేసిన సర్దార్ గౌతు లచ్చన్న పోరాట స్ఫూర్తిని కొనసాగించడమే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి. ఆయన ఆశయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది అని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# పేదల ఆరోగ్య భద్రతకు సీఎం చంద్రబాబు పెద్దపీట

- విద్య, వైద్యం ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట
- పేదలకు మేలు చేస్తుంటే.. ఓర్వలేక వైసీపీ విషప్రచారం
- మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

టంగుటూరు (చైతన్యరథం): ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి ఆకాంక్ష అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఆదివారం ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం కాకుటూరు వారిపాలెంలో విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్ ని మంత్రి ప్రారంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పేదప్రజల ఆరోగ్య భద్రతకు సీఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. పేదల విద్య, వైద్యం ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. వైసీపీ హయాంలో పేద ప్రజల ఆరోగ్యానికి గాలికొదిలి వైద్య శాఖను నిర్లక్ష్యం చేశారన్నారు. నాడు ప్రభుత్వ ఆసుపత్రిలో కనీసం మందులు కూడా దొరికే పరిస్థితి లేదన్నారు. నేడు కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. పీ 4 తో రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని చెప్పారు. సీఎం చంద్రబాబు పేదలకు మేలు చేస్తుంటే.. వైసీపీ ఓర్వలేక రాష్ట్రంలో శవ, కుల రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. వైసీపీ ఓ విషవృక్షం ప్రజలు దాన్ని కూకటి వేళ్ళతో పెకిలించాలని లేకుంటే రాష్ట్రానికి ప్రమాదకరమని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.



# కూటమి ప్రభుత్వంలో పల్లె సీమలకు మహర్దశ

- సూపర్ సిక్స్ సూపర్ సక్సెస్
- మంత్రి కందుల దుర్గేష్
- ఎంపీ పురందేశ్వరి, స్కిల్ డెవలప్మెంట్ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావుతో కలిసి అభివృద్ధి పనులకు మంత్రి ప్రారంభోత్సవం

నిడదవోలు (చైతన్యరథం) తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గం పెరవలి మండలం కానూరు అగ్రహారం గ్రామంలో రూ.20 లక్షల ఎంపీలాడ్స్ నిధులతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్, కానూరు గ్రామంలో రూ.17 లక్షల ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన జెడ్పీ హైస్కూల్ కాంపౌండ్ వాల్ ను ఎంపీ పురందేశ్వరి, మంత్రి కందుల దుర్గేష్, స్కిల్ డెవలప్ మెంట్ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు లు ఘనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. గత రెండేళ్ల కాలంలో కానూరు అగ్రహారంలో రూ.4.40 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. ఎంపీలాడ్స్ నిధులు మంజూరు చేసిన ఎంపీ పురందేశ్వరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంలో ఆరేడు ప్రాంతాల్లో ఎంపీ నిధులతో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం చేపట్టగా, మొదటి హాల్‌ను ఇక్కడ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. అభివృద్ధిలో భాగంగా పంచాయతీ రాజ్ ద్వారా పల్లెపండుగ 1.0 లో రూ.15 కోట్లతో హౌసింగ్ కాలనీలో సీసీ రోడ్లు, పల్లె పండుగ 2.0 లో రూ.35.45 లక్షలతో గోదావరి కట్టని ఊరుతో అనుసంధానం చేసే 6 రహదారి పనులు చేపట్టామన్నారు. రూ.73 లక్షల జల్ జీవన్ మిషన్ నిధులతో సురక్షిత తాగునీటి కల్పన, రూ.30 లక్షల డీఎంఎఫ్ నిధులతో సీసీ డ్రెయిన్ నిర్మాణం, రూ.20 లక్షల ఎంపీలాడ్స్ నిధులతో ఎస్సీ కమ్యూనిటీ హాల్, రూ. 36 లక్షల జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ నిధులతో హెల్త్ సెంటర్ భవనం నిర్మాణం, రూ.23.04 లక్షల మండల



ప్రజా పరిషత్ నిధులు, రూ.19.93 లక్షల పంచాయతీ నిధులతో అభివృద్ధి పనులు చేశామన్నారు. రూ.8.90 లక్షలతో 4 గోకులం షెడ్లు, రూ.14.83 లక్షల విలువైన 39 సీఎంఆర్ఎఫ్ చెక్కులు లబ్ధిదారులకు అందించడమైందన్నారు. రూ.1.64 కోట్ల శాస్కి నిధులతో మెయిన్ రోడ్డు నుండి రహదారి నిర్మాణం చేపడతామన్నారు.

గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన రోడ్లకు కూటమి ప్రభుత్వంలో ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. రూ.27 కోట్లతో డి.ముప్పవరం నుండి కాపవరం వరకు రోడ్డు నిధులపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారని, అలాగే విజ్జేశ్వరం నుండి సిద్ధాంతం వరకు ఏటిగట్టు రహదారి పటిష్ఠతకు ఇప్పటికే సీఎం, డిప్యూటీ సీఎంలకు ప్రతిపాదనలు పంపామని పేర్కొన్నారు.రాబోయే గోదావరి పుష్కరాల నాటికి గోదావరి తీరంలోని ఘాట్లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ హామీలను విజయవంతంగా అమలు చేస్తూ ప్రజాదరణ పొందుతోందన్నారు. త్వరలోనే నూతన పింఛన్లు, ఇళ్ల నిర్మాణాలపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించనుందని తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### రెండేళ్లలో రూ.8.18 కోట్లతో అభివృద్ధి

రెండేళ్లలో రూ.8.18 కోట్లతో కానూరు గ్రామంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. రూ.69.90 లక్షలతో పల్లెపండుగ 1.0 క్రింద 6 పనులు, రూ. 57 లక్షలతో పల్లెపండుగ 2.0 క్రింద 4 పనులు, రూ.5 లక్షల పంచాయితీ నిధులు, రూ.26.81 లక్షల ఎంపీపీ నిధులు, రూ.13.00 లక్షల జిల్లా పరిషత్ నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. రూ.2.08 కోట్ల జల్ జీవన్ మిషన్ నిధులతో రెట్రోఫిట్టింగ్ క్రింద ఇంటింటికి కుళాయిలు అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. రూ.30 లక్షల డీఎంఎఫ్ నిధులతో సీసీ డ్రెయిన్లను నిర్మించామన్నారు. రూ. 3.60 లక్షలతో 2 గోకులం షెడ్లను, రూ.1.50 కోట్ల నాబార్డు నిధులతో కానూరు నుండి నడుపల్లి కోట వరకు రహదారి నిర్మించామన్నారు. అదే విధంగా రూ.4.34 కోట్ల శాస్కి నిధులతో కానూరు నుండి కోరుపల్లి వరకు, కానూరు నుండి ఏసులుమద్రుపాడు వరకు రహదారిని నిర్మిస్తామన్నారు. రూ.17.50 లక్షల ఎంపీలాడ్స్ నిధులతో జెడ్పీ హైస్కూల్ కాంపౌండ్ వాల్ ను నిర్మించామన్నారు. రూ.9 లక్షల నేషనల్ హెల్త్ మిషన్ నిధులతో గ్రామంలో హెల్త్ సెంటర్ భవనం అభివృద్ధికి కృషి చేస్తున్నామని, రూ.13.81 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను 36 మంది లబ్ధిదారులకు అందించినట్లు మంత్రి దుర్గేష్ వెల్లడించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# గౌతు లచ్చన్న స్ఫూర్తితో కూటమి పాలన

- ఆయన పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శం
- బీసీలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ గుర్తింపు టీడీపీతోనే
- బీసీలను అన్నింటా ముందంజలో నిలబెట్టడమే చంద్రబాబు లక్ష్యం
- సంక్షేమ పథకాలతో అత్యధికంగా లబ్ధి పొందేది కూడా బీసీలే
- జగన్ హయాంలో ఎందరో బీసీలు హత్యలకు గురయ్యారు
- బీసీల్లో చిచ్చుకు గొడ్డలిపార్టీ కుట్రలు
- బీసీ యువతకు అండగా నిలుస్తున్న చంద్రబాబు
- మంత్రులు సవిత, అనగాని, కొలుసు పార్థసారథి స్పష్టీకరణ
- విజయవాడలో ఘనంగా గౌతు లచ్చన్న రాష్ట్ర స్థాయి జయంత్యోత్సవం
- 125 మంది విద్యార్థులకు రూ.25 లక్షల నగదు పురస్కారాలు




విజయవాడ (చైతన్యరథం): సర్దార్ గౌతు లచ్చన్న స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని, బీసీలను రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అన్నింటా ముందంజలో నిలబెట్టేలా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని మంత్రులు సవిత, అనగాని సత్యప్రసాద్, కొల్లు రవీంద్ర కొలుసు పార్థసారథి తెలిపారు. గౌతు లచ్చన్న పోరాట స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయాలన్న ఉద్దేశంతోనే ఆయన జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నామన్నారు. బీసీలను జగన్ వేధిస్తే, సీఎం చంద్రబాబు అక్కున చేర్చుకున్నారన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న రాష్ట్ర స్థాయి జయంత్యోత్సవాన్ని బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు సవిత, అనగాని సత్యప్రసాద్, కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి తొలుత గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మంత్రులు ప్రసంగించారు.

గౌతు లచ్చన్న 117వ జయంతిని జరుపుకోవడం ఆనందంగా ఉందని మంత్రి సవిత తెలిపారు. 1909 ఆగస్టు 16న గౌతు లచ్చన్న శ్రీకాకుళం జిల్లా బారువా గ్రామంలో సామాన్య గౌడు కుటుంబంలో జన్మించారన్నారు. తన 21వ ఏటనే గాంధీజీ పిలుపు మేరకు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. ఆ ఉద్యమంలో గౌతు లచ్చన్న వెన్నుచూపని పోరాటం చేశారని, జైలు శిక్షలు సైతం అనుభవించిన యోధుడని కొనియాడారు. అణగారిన వర్గాలు, బీసీలు, రైతులు, కార్మికుల హక్కుల కోసం తుది శ్వాస విడిచిపెట్టే వరకూ పోరాటం చేశారన్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా బీసీలు, రైతులు, శ్రామికుల అభ్యున్నతికి కృషి చేశారన్నారు.. గౌతు లచ్చన్న ఆశయాల సాధనే లక్ష్యంగా సీఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నారన్నారు. అన్న ఎన్టీఆర్ బీసీల అభ్యున్నతి కోసం టీడీపీని స్థాపించారన్నారు. బీసీలకు టీడీపీ ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యమిస్తూ పాలన సాగిస్తున్నాయన్నారు. విద్యతోనే బీసీలు అభివృద్ధి చెందుతారని నమ్మిన వ్యక్తి సీఎం చంద్రబాబు అని అన్నారు. అందుకే, రాష్ట్ర వ్యాప్తంగా బీసీ గురుకులాలను సీఎం చంద్రబాబు ఏర్పాటు చేస్తున్నారన్నారు. గౌతు లచ్చన్న జయంతిని జరగకుండా జగన్ తన హయాంలో అడ్డంకులు సృష్టించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, గౌతు లచ్చన్న జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించేలా గతేడాది జీవో జారీ చేశామన్నారు. గౌతు లచ్చన్న పోరాట స్ఫూర్తి, ప్రజా సేవ, దేశభక్తి నేటి తరం యువతకు ఎంతో ఆదర్శమన్నారు. దేశానికి, వెనుబడిన వర్గాల అభ్యున్నతికి గౌతు లచ్చన్న చేసిన సేవలు భావితరాలకు తెలియజేయాలన్న సంకల్పంతో ఆయన జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నామన్నారు. మద్యం షాపుల్లో గీత కార్మికులకు పది శాతం రిజర్వేషన్లు కల్పించి వ్యాపార వేత్తలుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతో అత్యధికంగా లబ్ధి పొందుతున్నది బీసీలేనని మంత్రి సవిత తెలిపారు.

## జగన్ హయాంలో బీసీల హత్యలు : మంత్రి అనగాని

బీసీల హక్కుల కోసం, వారి అభ్యున్నతి కోసం గౌతు లచ్చన్న ఎన్నో ఉద్యమాలు చేశారని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రైతుల కోసం మొట్టమొదటిసారి పాదయాత్ర చేసిన ఘనత కూడా ఆయనదేనన్నారు. శ్రీకాకుళం నుంచి చెన్నై వరకూ 1600ల కిలో మీటర్ల పాదయాత్ర చేశారన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో లచ్చన్న పోరాటం ఆనాటి ఆంగ్లేయులకు కంటి మీద కునుకు లేకుండా చేసిందన్నారు. చివరికి ఆయనపై కనిపిస్తే కాల్చివేతకు ఆదేశాలిచ్చిందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరవాత బీసీలు, రైతులు, కార్మికుల హక్కుల కోసం లచ్చన్న నిరంతరం పోరాటం చేశారన్నారు. జగన్ హయాంలో ఎందరో బీసీలు హత్యలకు గురయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు.సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, బీసీలను అక్కున చేర్చుకున్నారన్నారు. బీసీలు విద్యతోనే ఉన్నత స్థానాలకు చేరుకోగలరని సీఎం చంద్రబాబు నమ్మకమన్నారు. అందుకనే, బీసీల విద్యకు అధిక ప్రాధాన్యమిస్తున్నారని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.

## బీసీలు ఐక్యంగా ఉండాలి : మంత్రి పార్థసారథి

బీసీలు ఐక్యంగా ఉండాల్సిన అవశ్యకత ఎంతో ఉందని మంత్రి కొలుసు పార్థసారథి పిలుపునిచ్చారు. బీసీల ఐక్యతను దెబ్బతీయడానికి కుట్ర పన్నుతున్నారని, అప్రమత్తంగా ఉండాలని అన్నారు. బీసీల పేరుతో కొందరు వైసీపీ నాయకులు నేరాలకు పాల్పడుతున్నారన్నారు. తప్పులు చేసిన వారు ఎంతటి వారైనా శిక్ష తప్పదని హెచ్చరించారు. బీసీ యువత తమ హక్కుల సాధనకు పోరాటాలు చేయక తప్పదన్నారు. బీసీల అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబునాయుడు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. కేవలం పెన్షన్లు, ఇతర సంక్షేమ పథకాలు అందజేసి బీసీలను నిర్లక్ష్యం చేయకూడదని, వారిని అన్ని విధాలా అభివృద్ధి చేయాలనేదే ఆయన సిద్ధాంతమని తెలిపారు.

ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ, సర్దార్ గౌతు లచ్చన్న కుటుంబాన్ని జగన్ అవమానానికి, వేధింపులకు గురి చేశాడని మండిపడ్డారు. తన తాత విలువలతో కూడిన రాజకీయాలు చేశారన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా ప్రజా సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషించారన్నారు. నేడు జగన్ ప్రతిపక్ష హోదా ఇవ్వాలని కోరడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రతిపక్ష హోదా అనేది ఎవరో ఇచ్చే డిగ్రీ పట్టా కాదని, ప్రజలు మాత్రమే ఇచ్చేదాని విమర్శించారు.

## 125 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

అనగాని సత్యప్రసాద్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గౌడ సామాజిక వర్గానికి చెందిన 125 మంది విద్యార్థులకు రూ.25 లక్షల నగదును పురస్కారాల రూపంలో అందజేశారు. టెన్త్, ఇంటర్ లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ఈ నగదు పురస్కారాలు మంత్రులు సవిత, అనగాని సత్యప్రసాద్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహనరావు, కుమార వర్మ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జున, బీసీ సంక్షేమ శాఖాధికారులు, పలువురు కార్పొరేషన్ చైర్మన్లు వీరంకి గురుమూర్తి, కె.సత్తిబాబు, పేరేపి ఈశ్వర్, వై.రమణ, డైరెక్టర్లు, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు, గౌడ సామాజిక వర్గీయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# బలిజల అభివృద్ధికి కృషి

- మంత్రి నారాయణ హామీ
- నెల్లూరులో బలిజ భవన్ కల్యాణ మండపం ప్రారంభించిన మంత్రి




నెల్లూరు (చైతన్యరథం): నెల్లూరు సిటీ నియోజకవర్గం 15వ డివిజన్ బాలాజీనగర్‌లో బలిజ, కాపు, తెలగ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన బలిజ భవన్ కల్యాణ మండపాన్ని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, టీటీడీ మాజీ చైర్మన్ చదలవాడ కృష్ణమూర్తి, మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరంలతో కలిసి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆదివారం ప్రారంభించారు. మంత్రికి సంఘ నాయకులు, సభ్యులు, కాపు నేతలు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. బలిజ భవన్ కల్యాణ మండపం ప్రారంభోత్సవానికి హాజరు కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. భవన నిర్మాణానికి కృషి చేసిన సంఘ పెద్దలు, దాతలకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ భవనం వెనుక దశాబ్దాల చరిత్ర ఉందని గుర్తుచేశారు. 1979లో స్వర్గీయ ఎన్.జి.కె. మూర్తి, పసుపులేటి రామ్మూర్తి, నక్క బాలకోటయ్య, జి.ఎల్. నరసింహారావు, ముత్యాల చంద్రమోహన్, పగడాల ప్రభాకర్‌రావు, సిద్ధంశెట్టి రాధాకృష్ణయ్య, పట్నం ఈశ్వరరావు, తదితర పెద్దలు భవనం కోసం స్థలాన్ని కొనుగోలు చేశారని తెలిపారు. 2022లో నూతన కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన డీవీఎస్ గిరి బలిజ భవన్ నిర్మాణ సంకల్పంతో ముందుకు సాగారని, 2023 సెప్టెంబర్ 10న శంకుస్థాపన జరిగిందని చెప్పారు. భవన నిర్మాణానికి తన వంతుగా రూ.55 లక్షలు, చదలవాడ కృష్ణమూర్తి రూ.33 లక్షలు, డీవీఎస్ గిరి రూ.18 లక్షలు అందించడంతో పాటు పలువురు కాపు నేతలు, దాతలు సహకరించారని మంత్రి తెలిపారు. కాపు భవన్ నిర్మాణానికి కూడా తాను రూ.2 కోట్ల ఆర్థిక సహాయం అందించినట్లు చెప్పారు. బలిజ భవన్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను మంత్రి నారాయణ అభినందించారు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు అండగా నిలిచేందుకు 'బలిజ భవన్ భరోసా' కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు.

'అమృత కలశం' ద్వారా ప్రతి నెలా నిరుపేద, ఆసరా లేని కుటుంబాలకు 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందిస్తున్నారని, ఇప్పటివరకు సుమారు రూ.5 లక్షలతో 250 కుటుంబాలకు సేవలు అందించడం గొప్ప విషయమన్నారు.

విద్యలో వెనుకబడటం వల్లే బలిజ యువత అనేక అవకాశాలను కోల్పోతున్నారని మంత్రి పేర్కొన్నారు. పిల్లల చదువులు మధ్యలో ఆగిపోకుండా ఇప్పటివరకు సుమారు రూ.3 లక్షలతో 100 కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం అభినందనీయమన్నారు. మహిళలకు 90 రోజుల పాటు ఉచిత కుట్టు శిక్షణ ఇచ్చి, ఒక్కొక్కరికి రూ.10 వేల విలువైన ఉషా కుట్టు మిషన్‌ను ఉచితంగా అందించడం మంచి కార్యక్రమమని ప్రశంసించారు. ఇప్పటివరకు సుమారు 35 కుటుంబాలకు కుట్టు మిషన్లు అందించారని తెలిపారు.

కాపు యువత విద్య, ఉద్యోగం, వ్యాపారం, పారిశ్రామిక రంగాల్లో ముందుకు వెళ్లేలా సంఘాలు మరింత ప్రోత్సాహం అందించాలని మంత్రి సూచించారు. తాజాగా ప్రారంభమైన బలిజ భవన్ రాబోయే తరాలకు ఉపయోగపడే సామాజిక, సాంస్కృతిక, సేవా కేంద్రంగా ఎదగాలని ఆకాంక్షించారు. బలిజ భవన్ అభివృద్ధికి, బలిజ కుటుంబాల సంక్షేమానికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని, అందుకు మంత్రి నారాయణ నిలువెత్తు నిదర్శనమన్నారు. విలువలతో కూడిన రాజకీయాలతో పాటు మంచి పేరు సంపాదించుకున్న నారాయణ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి అత్యంత నమ్మకమైన వ్యక్తిగా నిలిచారని పేర్కొన్నారు. కాపులను ఎదగనీయకుండా కొంతమంది అడ్డుకున్నారని, అలాంటి వారి వెనుక కాపులు నిలవడంబాధాకరమన్నారు.

వంగవీటి రంగా తర్వాత ఆ స్థాయి చరిష్మా పవన్ కల్యాణ్‌కు వచ్చిందని, ఆయన చరిష్మాను తగ్గించేందుకు వైఎస్సార్‌సీపీ కుట్రలు చేస్తోందని ఆరోపించారు.

టీటీడీ మాజీ చైర్మన్ చదలవాడ కృష్ణమూర్తి మాట్లాడుతూ తాను నెల్లూరులోనే చదువుకున్నానని, తన కుమారుడు కూడా నెల్లూరులో ఇంజనీరింగ్ చదివారని తెలిపారు. స్నేహితులతో విహారయాత్రకు వెళ్లిన సమయంలో తన కుమారుడు ప్రమాదవశాత్తు మృతి చెందడం తనను తీవ్రంగా కలచివేసిందని, నెల్లూరుకు రావాలంటే ఆ బాధ గుర్తుకు వస్తుందని భావోద్వేగానికి గురయ్యారు. బలిజ భవన్‌ను అద్భుతంగా నిర్మించారని, భవన్ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎప్పటికీ ఉంటాయని చెప్పారు. మంత్రి నారాయణ నిబద్ధత, నిజాయితీ కలిగిన నేత అని, కాపులంతా ఆయనకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు.

మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి మంత్రి నారాయణ కృషి చేస్తున్నారని, రాష్ట్రంలోని కాపు సమాజానికి ఆయన అండగా నిలవాలని కోరారు. తాను చేసిన సహాయాన్ని కూడా చెప్పుకోవడానికి ఇష్టపడని గొప్ప వ్యక్తి మంత్రి నారాయణ అని ప్రశంసించారు.

కార్యక్రమంలో కాపు నేతలు ఆరేటి ప్రకాశ్, చలమయ్య నాయుడు, సుధాకర్, డీవీఎస్ గిరి, పసుపులేటి రామ్మూర్తి, చాట్ల నరసింహారావు, డాక్టర్ పోకల రవి, కొట్టే రామ్మూర్తి, మహేష్, కొట్టే సాయి, బలిజ భవన్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చైతన్యరథం

# సామాన్య కుటుంబం నుండి సర్దార్ స్థాయికి!

- గౌతు లచ్చన్న జీవితం అందరికీ ఆదర్శం
- నాయకులకు ఆయన జీవితం స్ఫూర్తి దాయకం
- మంత్రి కొల్లు రవీంద్ర ఉద్ఘాటన
- విజయవాడలో ఘనంగా సర్దార్ గౌతు లచ్చన్న జయంతి ఉత్సవాలు



విజయవాడ (చైతన్యరథం): ఒక రాజకీయ నాయకుడు ఎలా ఉండాలో సర్దార్ గౌతు లచ్చన్న జీవితాన్ని చదివితే సరిపోతుందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన సర్దార్ గౌతు లచ్చన్న 117 జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి తొలుత ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు.

అనంతరం మంత్రి కొల్లురవీంద్ర మాట్లాడుతూ.. స్వార్థ ప్రయోజనాల కంటే దేశ ప్రయోజనాలే ముఖ్యమని నినదించిన ఘనత సర్దార్ గౌతు లచ్చన్నకే సొంతం అన్నారు. శ్రీకాకుళం జిల్లాలోని ఓ సామాన్య కుటుంబంలో పుట్టిన గౌతు లచ్చన్న నాటి స్వతంత్ర మహా సంగ్రామంలో అత్యంత కీలకంగా ఎదిగారు. తన పోరాటాలు, పట్టుదలతో సర్దార్ బిరుదు పొందారు. లచ్చన్న సూచించిన మార్గంలో బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నాడు ఎన్టీఆర్, తర్వాత నారా చంద్రబాబు నాయుడు, ఇప్పుడు నారా లోకేష్ కృషి చేస్తున్నారు. బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు అందాలి, అభివృద్ధి ఫలాలు దక్కాలనే చిత్తశుద్ధితో కూటమి ప్రభుత్వం పని చేస్తోంది.

ఐదు సంవత్సరాల వైసీపీ పాలన మొత్తం రాష్ట్రంలోని బీసీలను అణగదొక్కడమే లక్ష్యంగా పాలన సాగింది. ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు, ఎదురించిన వారిపై దాడులు, నిలదీసిన వారి నరికి వేతలతో బీతావాహ వాతావరణం సృష్టించారు. తోట చంద్రయ్య, నందం సుబ్బయ్య, అమర్నాథ్ గౌడ్ లాంటి ఎంతో మంది బీసీలను అత్యంత కిరాతకంగా హత్యలు చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్నారనే కక్షతో.. అచ్చెన్నాయుడు, అయ్యన్న పాత్రుడు, యనమల రామకృష్ణుడు లాంటి ఎంతో మంది బీసీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టి వేధించారు. అణచివేస్తే ఆగిపోతారు అనే ఉద్దేశ్యంతో దుర్మార్గాలకు పాల్పడ్డారు. కానీ.. బీసీలను అణచివేయడం ఎవరికీ సాధ్యం కాదని, వారు తలచుకుంటే ఎంతటి కొమ్ములు తిరిగిన వారినైనా నేల కూలుస్తారని మొన్నటి ఎన్నికల్లో నిరూపించారని మంత్రి రవీంద్ర అన్నారు.

కల్లుగీత వర్గాల అభ్యున్నతి లక్ష్యంగా 1986లోనే పందిరిమామిడిలో అన్న ఎన్టీఆర్ నీరా ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దశాబ్దాలుగా ఆ కేంద్రం నిర్లక్ష్యానికి గురవ్వడం బాధాకరం. ఈ మధ్యనే నీరా కేంద్రాన్ని పరిశీలించాం. త్వరలోనే పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. వైసీపీ ఐదేళ్ల పాలనలో కల్లుగీత కార్మికులకు పైసా సాయం అందించలేదు. కూటమి అధికారంలోకి రాగానే ప్రమాద వశాత్తు చెట్టుపై నుండి పడి మరణించిన కార్మికులకు రూ.3.95 కోట్లు చెల్లించాం. త్వరలోనే ఎక్సైజ్ శాఖ ద్వారా మరో 33 మందికి రూ.1.65 కోట్లు అందించాలని నిర్ణయించాం.

బీసీలకు రక్షణగా నిలిచే ఉద్దేశ్యంతో బీసీ రక్షణ చట్టం తీసుకు రాబోతున్నాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను వైసీపీ ప్రభుత్వంలో ఉద్దేశ్యపూర్వకంగా కుదించారు. 34 శాతం రిజర్వేషన్లను కుదించి 24 శాతానికి పరిమితం చేశారు. కానీ కూటమి ప్రభుత్వం రిజర్వేషన్ల సాధనకు చిత్తశుద్ధితో పని చేస్తోంది. వీలైనంత త్వరగా 34 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరిస్తాం. ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు, నారా లోకేశ్ బీసీల ఎదుగుదల గురించి ఆలోచిస్తే.. జగన్ రెడ్డి బీసీలను అణచివేయడమే లక్ష్యంగా పాలన సాగించారు. సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేదికగా చెబుతున్నాం. బీసీల హక్కుల సాధనకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ చిత్తశుద్ధితో పని చేస్తోంది. ఆయన ఆశయాల సాధనకై కట్టుబడి నిలుస్తుందని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

కార్యక్రమంలో మంత్రులు ఎస్.సవిత, అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహనరావు, గౌతు శిరీష, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, బీసీ కార్పొరేషన్ ఛైర్మన్ రెడ్డి అనంత కుమారి, శాసనమండలి మాజీ డిప్యూటీ స్పీకర్ రెడ్డి సుబ్రహ్మణ్యం, కార్పొరేషన్ ఛైర్మన్లు వీరంకి వెంకట గురుమూర్తి, కుడిపూడి సత్తిబాబు, ఎరుబోతు రమణ, తదితర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## రూ.40 లక్షలతో సిద్ధి వినాయక ఆలయ పునఃనిర్మాణం

- భూమిపూజ చేసిన మంత్రి నారాయణ దంపతులు
- ఎన్నికల హామీ నెరవేర్చిన మంత్రి



నెల్లూరు (చైతన్యరథం): నెల్లూరు నగరంలోని 50వ డివిజన్ బుజ్జమ్మ రేవు సమీపంలో సిద్ధి వినాయక ఆలయ పునఃనిర్మాణానికి సతీమణి రమాదేవితో కలిసి మంత్రి నారాయణ ఆదివారం భూమి పూజ చేశారు. మంత్రి దంపతులకు నగర టీడీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు కపిర రేవతి, రాష్ట్ర వేర్ హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్ కపిర శ్రీనివాసులు దంపతులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు. గతంలో ఇక్కడ నాలుగు గోడలతో మాత్రమే ఉన్న చిన్న ఆలయాన్ని నిరుపేదలైన స్థానికులు అభివృద్ధి చేయలేక వదిలేశారని, ఎన్నికల ప్రచారంలో కపిర రేవతి, సీనయ్య కోరిక మేరకు తాను ఇచ్చిన హామీ ప్రకారం ఇప్పుడు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజల్లో భక్తిభావం పెరిగిన నేపథ్యంలో ఈ ఆలయ నిర్మాణ పనులను బాధ్యులు వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. స్థానిక రజకుల ఆకాంక్ష మేరకు సమీపంలోని చాకలి రేవు అభివృద్ధిపై కూడా మంత్రి కీలక ప్రకటన చేశారు. అక్కడ ఇప్పటికే కొన్ని గదుల నిర్మాణాలు పూర్తి కాగా, మిగిలిన గదులను కూడా త్వరితగతిన పూర్తి చేసి అందించాలని మున్సిపల్ కమిషనర్‌ను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మేయర్ సుజాత, కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ జెడ్పిటిసి విజేతా రెడ్డి, డివిజన్ ప్రెసిడెంట్ సిద్ధయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ గౌతు లచ్చన్న సేవలు చిరస్మరణీయం

**- మంత్రి వాసంశెట్టి సుభాష్ నివాళులు**



అమలాపురం (చైతన్యరథం): అణగారిన బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి సుభాష్ పాల్గొని, గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో కీలక పాత్ర పోషించిన గౌతు లచ్చన్న జీవితాంతం సామాజిక న్యాయం, సమానత్వం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పోరాటం చేశారని కొనియాడారు. రైతులు, కార్మికులు, పేద ప్రజల హక్కుల సాధన కోసం ఆయన చేసిన ఉద్యమాలు నేటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు.

ప్రజాస్వామ్య విలువలు, సామాజిక సమానత్వం, న్యాయం కోసం గౌతు లచ్చన్న చూపిన మార్గాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని మంత్రి సూచించారు. సమాజ అభ్యున్నతి కోసం ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సర్దార్ గౌతు లచ్చన్న వంటి మహనీయుల జీవిత చరిత్రలు భావితరాలకు మార్గదర్శకాలని, సమాజంలో వెనుకబడిన వర్గాల సాధికారత కోసం ఆయన చేసిన కృషి ఎప్పటికీ మరువలేనిదని మంత్రి సుభాష్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, వేగుళ్ల జోగేశ్వరరావు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గుత్తుల సాయి, జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పళ్లంరాజు, రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొల్లపల్లి అమూల్య, గన్నవరం నియోజకవర్గం టూ మెన్ కమిటీ సభ్యులు మోకా ఆనంద సాగర్, దాసరి వీర వెంకట సత్యనారాయణ, అముడా చైర్మన్ అల్లాడి స్వామి నాయుడుతో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## 60 లక్షల ఇళ్ల మైలురాయిని దాటి..!

- జోరుగా 'ఇంటింటికీ తెలుగుదేశం'
- 21 రోజుల్లో 61.61 లక్షల ఇళ్లను సందర్శించిన టీడీపీ నేతలు, శ్రేణులు
- ఆదివారం 2.60 లక్షల కుటుంబాలతో మమేకం
- కూటమి రెండేళ్ల అభివృద్ధి-సంక్షేమ ఫలాలను ప్రజల ముంగిటకు తీసుకెళ్తున్న వైనం

అమరావతి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలను ప్రతి కుటుంబానికి వివరించడంతో పాటు.. ప్రజల అభిప్రాయాలు, స్థానిక సమస్యలను నేరుగా తెలుసుకునే లక్ష్యంతో తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న "ఇంటింటికీ తెలుగుదేశం – 2 ఏళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమం మరో కీలక మైలురాయిని అధిగమించింది. రాష్ట్రవ్యాప్తంగా 60 లక్షల ఇళ్ల సందర్శనల మార్క్‌ను దాటి, 21 రోజుల్లో మొత్తం 61.61 లక్షల ఇళ్లకు టీడీపీ శ్రేణులు సందర్శించారు. 21వ రోజు ఆదివారం కూడా పార్టీ నాయకులు, కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా క్షేత్రస్థాయిలో పర్యటించి 2.60 లక్షల ఇళ్లను సందర్శించి ప్రజలతో నేరుగా మమేకమయ్యారు. ప్రతి ఇంటి వద్ద కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వివిధ వర్గాలకు అందుతున్న ప్రయోజనాలను వివరించారు. 60 లక్షల ఇళ్ల సందర్శన మైలురాయిని అధిగమించడం 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమానికి ప్రజలతో పార్టీ శ్రేణుల ప్రత్యక్ష అనుసంధానానికి నిదర్శనంగా నిలిచింది. ప్రతి ఇంటి వద్ద రైతు సంక్షేమం, మహిళలు–యువతకు అందుతున్న ప్రయోజనాలు, పేదల సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పన, తదితర అంశాలను ప్రజలకు వివరిస్తున్నారు. అదే సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. 60 లక్షల ఇళ్ల మైలురాయిని అధిగమించిన స్ఫూర్తితో కార్యక్రమాన్ని మరింత వేగంగా, విస్తృతంగా కొనసాగిస్తూ.. కూటమి ప్రభుత్వ రెండేళ్ల అభివృద్ధి–సంక్షేమ ఫలాలను ప్రతి గడపకు చేర్చేందుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు కృషి చేస్తున్నారు.



# 84 ఏళ్ల వయసులోనూ తరగని దేశభక్తి

**1962 నాటి త్యాగధనురాలు గరిమెళ్ల సీతారావమ్మను పరామర్శించిన ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు**



విజయనగరం (చైతన్యరథం): హైదరాబాద్‌లోని స్టార్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ప్రముఖ దేశభక్తురాలు, 84 సంవత్సరాల వృద్ధురాలు గరిమెళ్ల సీతారావమ్మను విజయనగరం పార్లమెంట్ సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు స్వయంగా కలిసి పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులు, కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమెకు శాలువా కప్పి ఘనంగా సన్మానించి, పండ్లను అందజేసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ '1962లో భారత్, చైనా యుద్ధం జరుగుతున్న క్లిష్ట సమయంలో కేంద్ర ప్రభుత్వం దేశ రక్షణ నిధికి విరాళాలు కోరగా, అప్పుడే నవవధువుగా అత్తవారింట్లో అడుగుపెట్టిన సీతారావమ్మ తన పెళ్లి బంగారు ఉంగరాన్ని దేశం కోసం విరాళంగా ఇచ్చి గొప్ప ఔదార్యాన్ని చాటుకున్నారు. 84 ఏళ్ల వయసులో, అనారోగ్యంతో ఆసుపత్రి బెడ్‌పై ఆక్సిజన్ సాయంతో చికిత్స పొందుతున్నప్పటికీ చేతిలో జాతీయ జెండాను పట్టుకుని ఆమె ప్రదర్శిస్తున్న దేశభక్తి ప్రతి ఒక్కరినీ కదిలిస్తోంది. కృష్ణా జిల్లా నేపథ్యం కలిగిన సీతారావమ్మ లాంటి నిస్వార్థ వ్యక్తుల త్యాగాల వల్లే మనమంతా స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నాం. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ 'దేశమే ప్రథమం' అనే భావనతో ముందుకు సాగాలని, సీతారావమ్మ దేశభక్తిని నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని" ఆయన పిలుపునిచ్చారు. సీతారావమ్మ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఈ



18వ వార్డు సమతా కాలేజీ, కాలనీలో రూ.25.00 లక్షలు విలువతో డ్రైనేజీ ఫుట్ పాత్‌ల నిర్మాణానికి శంకుస్థాపనకు విశాఖపట్నం తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు హాజరయ్యారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోనల్ కమీషనర్ శివప్రసాద్, డీఈ అప్పలనాయుడు, గోలగాని పాలారావు, బుడుమూరి గోవింద్, గోలగానిమంగవేణి, కిషోర్, కళావతి, ఎం శ్రీనివాస్, గ్రామ పెద్దలు తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# అభివృద్ధి పనులు ప్రారంభం

దర్శి (చైతన్యరథం): పట్టణంలోని 17, 18వ వార్డులలో దాదాపు 40 లక్షల రూపాయల సీసీ రోడ్లు, డ్రైన్స్, నిమ్మల భవి చుట్టూ ప్రహరీ, వాటర్ పైపు లైన్ పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ. వారితో పాటు మాజీ శాసనసభ్యులు నారపుశెట్టి పాపారావు, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఏఎంసి చైర్మన్ దారం నాగవేణి, దర్శి మున్సిపల్ కమిషనర్ కె అర్జున్ రావు, దర్శి మండలం టౌన్ టిడిపి అధ్యక్షులు మారెళ్ళ వెంకటేశ్వర్లు, పుల్లలచెరువు సత్యనారాయణ, బీజేపీ నాయకులు మండపాకుల శ్రీనివాసరావు, వార్డు కౌన్సిలర్లు పానేం వాలి బాబు, నక్క చంద్ర – రంగ, వీసీ రెడ్డి, వార్డ్ టిడిపి అధ్యక్షులు నారపుశెట్టి శ్రీనివాస రావు, బూత్ ఇంచార్జి దారం నరసయ్య, క్లస్టర్లు, యూనిట్ ఢ బూత్ ఇంచార్జ్లు, వార్డ్ అధ్యక్షులు, దర్శి పట్టణం దర్శి నియోజకవర్గం లోని వివిధ హోదాల్లో ఉన్న టీడీపీ నాయకులు, మహిళలు, కూటమి శ్రేణులు తదితరులు ఉన్నారు.



# అసెంబ్లీకి రాని వైసీపీ నేతలకు ప్రజలు ఓట్లెలా వేస్తారు

## జగన్‌రెడ్డిని నిలదీసిన విష్ణుకుమార్‌రాజు





విశాఖపట్టణం (చైతన్యరథం): వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వ్యవహార శైలిపై, అసెంబ్లీని బహిష్కరిస్తున్న ఆ పార్టీ ఎమ్మెల్యే తీరుపై బీజేపీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జగన్‌ను ఎవరో పక్కదోవ పట్టిస్తున్నారని, అసెంబ్లీకి రాకుండా ఇంట్లో కూర్చొని కలలు కనవద్దని హితవు పలికారు. విశాఖలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శాసనసభకు హాజరుకాని వైసీపీ ఎమ్మెల్యేలకు రానున్న 2029 ఎన్నికలలో ప్రజలు ఎలా ఓటు వేస్తారని ప్రశ్నించారు. 11 మంది ఎమ్మెల్యేలను గెలిపించిన ప్రజలను వైసీపీ అవమానపరుస్తోందని, అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేలకు ప్రజలు వేసిన ఓటు వృధా అవుతోందని విష్ణు కుమార్ రాజు వ్యాఖ్యానించారు. శాసనసభలో తమకు సమయం ఇవ్వరంటూ జగన్ చేస్తున్న ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని కోరారు. 'వైసీపీ ఎమ్మెల్యేలు సభకు వస్తే మాట్లాడేందుకు మా సమయాన్ని కూడా ఇస్తాము. వారు వెంటనే అసెంబ్లీకి వచ్చి 22ఏ భూ సమస్యలు, మెగా డీఎస్సీ అక్రమాలపై చర్చించాలి' అని డిమాండ్ చేశారు. వైసీపీ ఎమ్మెల్యేలు సభకు వెళ్లేలా ఆ పార్టీ శ్రేణులే ధర్నాలు చేయాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో వైసీపీకి ఓటేసే ముందు ప్రజలు ఆలోచించాలని సూచించారు.

**విశాఖ ఎయిర్‌పోర్ట్‌పై సర్కార్ దృష్టి సారించాలి:**

మరోవైపు విశాఖపట్నం ఎయిర్‌పోర్టులో సేవలు నిలిచిపోవడంపై విష్ణుకుమార్ రాజు భావోద్వేగానికి గురయ్యారు. గత 40 ఏళ్లుగా ఈ విమానాశ్రయ సేవలను పొందుతున్నానని, ఒక శకం ముగిసిపోవడం బాధాకరమన్నారు. ఇవాళ చిట్టచివరి విమానంలో తాను విజయవాడ వెళ్తున్నట్లు తెలిపారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి కోస్టల్ కారిడార్ రోడ్డు, రవాణా సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చేంతవరకు విశాఖ నుంచే విజయవాడ, హైదరాబాద్, తిరుపతి

# ప్రభుత్వ హాస్టళ్ల అభివృద్ధికి సహకరించండి

**కేంద్రమంత్రి పెమ్మసాని పిలుపు**



గుంటూరు (చైతన్యరథం): ప్రభుత్వ హాస్టళ్ల డెవలప్‌మెంట్‌కు దాతలు ముందుకు రావాలని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లాలో పౌర గ్రంథాలయ శాఖ నూతన భవన నిర్మాణ అవగాహన ఒప్పంద కార్యక్రమం ఈరోజు (ఆదివారం) జరిగింది. ఈ కార్యక్రమంలో పెమ్మసాని, ఎమ్మెల్యే నసీర్, జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడారు. 1915లో బ్రిటీష్ వారు కమ్యూనిటీ హాల్‌ను స్టేట్ లైబ్రరీగా మార్చారని ప్రస్తావించారు. లక్షలాది మందికి ఈ లైబ్రరీ సేవలు అందిస్తుందని పెమ్మసాని వ్యాఖ్యానించారు. అయితే ప్రస్తుతం ఈ భవనం కూలే పరిస్థితికి వచ్చిందని తెలిపారు. అందుకే ఈ బిల్డింగ్ నిర్మించేందుకు చల్లా రాజేంద్రప్రసాద్ ముందుకు వచ్చారని అన్నారు. ఆయన వరల్డ్ బెస్ట్ కాఫీ లేబుల్స్‌ను డెవలప్ చేసి ప్రజలకు కాంటినెంటల్ కాఫీని అందిస్తున్నారని వెల్లడించారు. పేద వారు కూర్చొని చదువుకునే విధంగా దాదాపు రూ.20కోట్ల వరకు ఖర్చవుతుందని తెలిపారు. అందుకే రాజేంద్రప్రసాద్‌తో స్టేట్ లైబ్రరీ బిల్డింగ్ నిర్మాణానికి ఎంవోయూ చేయిస్తున్నామని చెప్పారు. ఈ జీ ప్లస్ టూ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ ప్రారంభానికి మంత్రి లోకేశ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.

## చోడవరం వెంకన్నపాలెం రహదారికి మోక్షం

నర్సీపట్నం (చైతన్యరథం): చోడవరం వెంకన్నపాలెం రహదారికి మోక్షం లభించింది. అధ్వానంగా ఉన్న ఈ రోడ్డులో ఏడేళ్లుగా ప్రత్యక్ష నరకం చూస్తున్న వాహనచోదకులకు ఊరట కలిగించే విధంగా రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. ఆగస్టు 15లోగా చోడవరం నుంచి వెంకన్నపాలెం వరకు ప్రధాన రహదారి పనులు పూర్తి చేస్తామని ఆర్అండ్‌బీ ఈఈ రంగయ్య స్థానిక అదనపు జిల్లా కోర్టు జడ్జికి ఇచ్చిన లిఖిత పూర్వక హామీ గడువు ముగిసిపోతున్న తరుణంలో ఈ రోడ్డు పనులు ప్రారంభించారు. బీఎన్ రోడ్డు దుస్థితిపై స్థానిక న్యాయవాదులు కాండ్రేగుల డేవిడ్, తదితరులు ఏడాదిన్నర క్రితం కోర్టులో కేసు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై పలుమార్లు విచారణకు హాజరైన ఆర్అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్ ప్రతినిధులు పనులు పూర్తి చేస్తామంటూ హామీలతో నెలల తరబడి వాయిదాలు వేసుకుంటూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో గత నెలాఖరున కోర్టు విచారణకు హాజరైన ఆర్అండ్‌బీ ఈఈ రంగయ్య ఆగస్టు 15లోగా చోడవరం నుంచి వెంకన్నపాలెం వరకు తొలుత పనులు పూర్తి చేస్తామని అఫిడవిట్ దాఖలు చేశారు. ఈ మేరకు వెంకన్నపాలెం నుంచి అంభేరుపురం వరకు సుమారు అరకిలో మీటరు మేర తారురోడ్డు పూర్తి చేశారు. ఇంకా అంభేరుపురం నుంచి గోవాడ మీదుగా చోడవరం వరకు రోడ్డు పనులు పూర్తికావలసి ఉంది. ఆలస్యంగానైనా పనులు ప్రారంభంకావడంతో స్థానికులతో పాటు వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.





# యువతలో ఆత్మవిశ్వాసం పెంపొందించే క్రీడలకు మద్దతివ్వాలి

## గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపు




గుంటూరు (చైతన్యరథం): యువతను చెడు అలవాట్లకు దూరంగా ఉంచి, ఆత్మవిశ్వాసం పెంపొందించే క్రీడా కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. గుంటూరులోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న "ఆజాదీ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్" పోటీలను సందర్శించి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... పల్నాడు, గుంటూరు జిల్లాలకు చెందిన యువతతో పాటు పెద్ద సంఖ్యలో క్రీడాకారులు ఈ టోర్నమెంట్‌లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. దాదాపు ఐదు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారని, సాయంత్రం విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. తెలుగుదేశం పార్టీ తెలుగు యువత నాయకుడు కొనిదె గోపి కృష్ణ ఆధ్వర్యంలో గత పదేళ్లుగా నిరంతరాయంగా ఈ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇది కేవలం ఒక ఆట మాత్రమే కాదని, యువతలో ఉత్సాహం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే గొప్ప వేదికగా నిలుస్తోందని పేర్కొన్నారు. నేటి సమాజంలో కొంతమంది యువత గంజాయి, మాదకద్రవ్యాలు మరియు ఇతర చెడు అలవాట్ల బారిన పడుతున్న నేపథ్యంలో, వారిని సన్మార్గంలో నడిపించేందుకు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అవసరమని ఎమ్మెల్యే తెలిపారు. యువతను మంచి దారిలోకి తీసుకువెళ్లాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన నిర్వాహకులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి క్రీడా పోటీలు ప్రతి సంవత్సరం మరింత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ఆకాంక్షించిన ఎమ్మెల్యే, కార్యక్రమ విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# సర్దార్ గౌతు లచ్చన్న జీవితం ఆదర్శప్రాయం

## మాజీమంత్రి దేవినేని ఉమా ఘన నివాళులు

గొల్లపూడి (చైతన్యరథం): బడుగు, బలహీన వర్గాలు, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు సర్దార్ గౌతు లచ్చన్న జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. లచ్చన్న జయంతి సందర్భంగా గొల్లపూడిలోని కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఐదు సార్లు శాసనసభ్యుడిగా, ఎమ్మెల్సీగా, ఎంపీగా ప్రజలకు విశేష సేవలందించిన లచ్చన్న పేదలు, అణగారిన వర్గాలు, రైతుల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేశారని దేవినేని ఉమా పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై ఆయన చూపిన తెగువ, సాహసం, కార్యదక్షతను గుర్తించిన ప్రజలే ఆయనకు 'సర్దార్' అనే బిరుదును అందించారని తెలిపారు. స్వాతంత్ర్యానికి పూర్వమే సామాజిక న్యాయం, పేదల అభ్యున్నతి కోసం పోరాడిన లచ్చన్న రైతుల సమస్యల పరిష్కారం కోసం శ్రీకాకుళం నుంచి మద్రాస్ వరకు పాదయాత్ర చేసి రైతుల గొంతుకను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లారని గుర్తుచేశారు. తాను నమ్మిన సిద్ధాంతాల కోసం పదవులను సైతం త్యాగం చేసిన ఆయన వ్యక్తిత్వం ఆదర్శ రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనమన్నారు. తన రాజకీయ గురువు ఎన్.జి.రంగా గారి కోసం ఎంపీ పదవికి సైతం రాజీనామా చేసిన గొప్ప నాయకుడు లచ్చన్న గారని కొనియాడారు. సర్దార్ గౌతు లచ్చన్న గారి సేవలను గుర్తించి ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. లచ్చన్న చూపిన మార్గంలో పయనిస్తూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి, రైతుల సంక్షేమం, సామాజిక న్యాయం కోసం తెలుగుదేశం పార్టీ నిరంతరం కృషి చేస్తోందని దేవినేని ఉమా స్పష్టం చేశారు.



# రూ.29.39 లక్షల సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

## కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ సానా సతీష్ బాబు

కాకినాడ (చైతన్యరథం): ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు కూటమి ప్రభుత్వం ఎప్పుడూ అండగా నిలిచేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తోందని రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు తెలిపారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన లద్ధిదారులకు ఆదివారం తన కార్యాలయంలో రూ.29,39,480 విలువైన 17 చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పమని ఎంపీ సానా సతీష్ బాబు అన్నారు. పేద కుటుంబాల కష్టాలను తన కుటుంబ సమస్యగా భావించి, వారికి అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా ఖరీదైన వైద్య చికిత్సలు చేయించుకునే స్థోమత లేని కుటుంబాలకు జవీ=ఖీ ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం ఎంతో ఊరటనిస్తుందని అన్నారు. అవసరమైన సమయంలో ప్రభుత్వ సహాయాన్ని లబ్ధిదారులకు చేరవేయడం తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మొత్తం రూ.29,39,480 విలువైన 17 చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ప్రభుత్వ ఆర్థిక సహాయానికి లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి, ఎంపీ సానా సతీష్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.



# బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే సహించం

## కరుణాకర్‌రెడ్డి వ్యాఖ్యలపై గొల్ల నరసింహ యాదవ్ ఆగ్రహం

తిరుపతి (చైతన్యరథం): బీసీ వర్గాలకు చెందిన మంత్రి అనగాని సత్యప్రసాద్, ఐఏఎస్ అధికారి వెంకటేశ్వర్లుపై కరుణాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ అన్నారు. తిరుపతిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీలను అవమానించేలా మాట్లాడిన కరుణాకర్‌రెడ్డి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తిరుపతి వంటి పవిత్ర నగరంలో కులాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలను సహించబోమని హెచ్చరించారు. బీసీలకు రాజకీయంగా గుర్తింపు, ప్రాధాన్యం కల్పించింది టీడీపీనేనని, ఎన్టీఆర్, చంద్రబాబు నాయకత్వంలో అనేకమంది బీసీలు కీలక పదవుల్లోకి వచ్చారని పేర్కొన్నారు. యాదవులు, ఇతర వెనుకబడిన వర్గాల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలను తిప్పికొడతామని నరసింహ యాదవ్ స్పష్టం చేశారు.



# వ్యాపారులకు అండగా కూటమి ప్రభుత్వం

## శ్రీ వాసవి ఫౌండేషన్ అభినందన సభలో తేదాపా పశ్చిమ ఇన్చార్జి బుద్ధ వెంకన్న



విజయవాడ పశ్చిమ (చైతన్యరథం): తెలుగుదేశం ప్రభుత్వం వ్యాపారస్తుల సంక్షేమానికి అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని తెదేపా జాతీయ ఉపాధ్యక్షులు, పశ్చిమ ఇన్చార్జి బుద్ధ వెంకన్న స్పష్టం చేశారు.శ్రీ వాసవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన వివిధ సంస్థల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి  పాలకవర్గ సభ్యులకు అభినందన సభ జరిగింది. ఆదివారం కొత్త గుళ్ళ సమీపం లోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆర్యవైశ్య కళ్యాణ మందిరంలో జరిగిన అభినందన సభకు శ్రీ వాసవి ఫౌండేషన్ చైర్మన్ వివికే నరసింహారావు సభాధ్యక్షత వ్యవహరించారు.కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన తెదేపా పశ్చిమ ఇంచార్జి బుద్ధా వెంకన్న హాజరై నూతనంగా ఎన్నికైన వివిధ సంస్థల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, సభ్యులకు అభినందనలు తెలిపి సత్కరించారు. ఈ సందర్భంగా బుద్ధా వెంకన్న మాట్లాడుతూ విజయవాడ పశ్చిమ నియోజకవర్గం వ్యాపార,వాణిజ్య వర్గాలకు కంచుకోట లాంటిదని గుర్తు చేశారు. కాలక్రమంలో ఈ కామర్స్ (ఆన్లైన్ బిజినెస్) వ్యాపారం జోరెందుకోవడంతో స్థానిక వ్యాపారుస్తులు వ్యాపారాలు లేక ఆర్థిక ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధి కోరుకునే వ్యక్తిగా వ్యాపారస్తులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని స్పష్టం చేశారు.  వ్యాపార వ్యాపార వర్గాలను సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ వద్దకు తీసుకువెళ్లి నూటికి నూరు శాతం సమస్య పరిష్కార దిశగా కృషి చేసి తీరుతానని హామీ ఇచ్చారు . కూటమి ప్రభుత్వం  వ్యాపార, వాణిజ్య వర్గాల అభ్యున్నతి, సంక్షేమానికి కట్టుబడి ఉంటుందని వెంకన్న మరోసారి స్పష్టం చేశారు . శ్రీ వాసవి ఫౌండేషన్ చైర్మన్ వివికే నరసింహారావు మాట్లాడుతూ వ్యాపార వర్గాలకు ఎల్లప్పుడూ అండగా ఉండే బుద్ధా వెంకన్న తెదేపా పశ్చిమ నియోజకవర్గం ఇన్చార్జి కావడం హర్షణీ యమన్నారు. బుద్ధా వెంకన్న వ్యాపారుల నుంచి దందాలు, చందాలు వసూలు చేసిన చరిత్ర ఎన్నడూ లేదని గుర్తు చేశారు. చాంబర్ ఆఫ్ కామర్స్ విజయవాడ అధ్యక్షులు  గద్దం బాల వెంకట రవికుమార్ మాట్లాడుతూ వ్యాపార వర్గాల సమస్యల పట్ల బుద్ధ వెంకన్న సానుకూలంగా స్పందించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు.కార్యక్రమంలో వాసవి ఫౌండేషన్ సహా పలువురు వ్యాపార ప్రముఖులు బుద్ధా వెంకన్నను సత్కరించారు.కార్యక్రమంలో గొల్లపూడి కమర్షియల్ మార్కెట్ అధ్యక్షులు పరుచూరి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కాసుల నారాయణ, ట్రెజరర్ నంబూరు సాంబశివరావు, ఆర్యవైశ్య ప్రముఖులు గద్దం సత్యనారాయణ, నంబూరు ప్రదీప్ కుమార్, కెవిఎల్ గణేష్, వంకాయల  , క్లాత్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు ఓలేటి జగన్మోహన్రావు,, ఐరన్ యాడ్ అధ్యక్షులు కందుకూరి అనిల్ కుమార్, క్లాత్ ఏజెన్సీ అధ్యక్షులు ఎన్వి గుప్తా తదితరులు పాల్గొన్నారు,



# సింహాచలేశుని సన్నిధిలో యార్లగడ్డ దంపతులు

గన్నవరం (చైతన్యరథం): సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామిని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, జ్ఞానేశ్వరి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. సింహాచలం చేరుకున్న యార్లగడ్డ దంపతులకు ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం అంతరాలయంలో అప్పన్న స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ అప్పన్న స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలకు ఎల్లప్పుడూ మంచి జరగాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.



# జగన్‌రెడ్డికి ఉపాధ్యాయుల గుణపాఠం : మాజీమంత్రి ప్రత్తిపాటి



చిలకలూరిపేట (చైతన్యరథం): డీఎస్సీపై జగన్ వైఖరి ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు అని మాజీమంత్రి ప్రత్తిపాటి పేర్కొన్నారు. ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. యువత, విద్యార్థుల్ని రెచ్చగొట్టి రాష్ట్రంలో చిచ్చు పెట్టాలన్నదే జగన్ దురాలోచన అని విమర్శించారు.

నిత్యం డీఎస్సీపై విమర్శలు చేసే వైసీపీనేతలు.. ఉపాధ్యాయులు కదం తొక్కడంతో తోక ముడిచారని ఎద్దేవా చేశారు.

ఏపీకి ప్రత్యేక హోదా సాధించలేని జగన్ అసమర్థత చూసే.. ప్రజలు 2024 ఎన్నికల్లో వైసీపీకి ఏ హోదా లేకుండా చేశారన్నారు. ఏపీపీఎస్సీ ప్రశ్నపత్రాల మూల్యాంకనంపై సమాధానం చెప్పలేకే.. జగన్ అసెంబ్లీకి ముఖం చాటేస్తున్నాడని విమర్శించారు. “ నిజం ఎప్పటికైనా అబద్ధాన్ని ఓడిస్తుందన్న సత్యాన్ని డీఎస్సీ 2025 టీచర్ల ఆత్మగౌరవ ర్యాలీ నిరూపించిందన్నారు. ఉపాధ్యాయుల ర్యాలీ భారీస్థాయిలో విజయవంతమైన నేపథ్యంలో మెగా డీఎస్సీపై ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్న జగన్.. వైసీపీ నేతలు ఇప్పటికైనా ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. ఆదివారం విజయవాడ నడిబొడ్డున ఉపాధ్యాయులు కదం తొక్కితే.. నిత్యం మీడియాలో, సోషల్ మీడియాలో పనిగొట్టుకొని డీఎస్సీపై సంకుచిత విమర్శలు చేసే గొడ్డలిపార్టీ నాయకులు తోక ముడిచారన్నారు. పాఠాలు చెప్పే తమతో గుణపాఠం చెప్పించుకునే పరిస్థితి తెచ్చుకోవద్దన్న ఉపాధ్యాయుల హెచ్చరికల్ని వైసీపీ బేఖాతరు చేస్తే, భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. అధికారంలో ఉన్నప్పుడే జగన్ కు ... టీచర్లు దిమ్మతిరిగే షాక్ ఇచ్చారన్నారు. సీపీఎస్ రద్దు చేస్తానని మాటతప్పిన జగన్ కు ఉపాధ్యాయులు ఆనాడే ముచ్చెమటలు పట్టించారు. ఉపాధ్యాయుల ఆత్మగౌరవ ర్యాలీ డీఎస్సీపై ప్రజావాణిని బలపరిచింది.. ఆదివారం నాటి ఉపాధ్యాయుల ఆత్మగౌరవ ర్యాలీ.. కూటమి ప్రభుత్వం పారదర్శకంగా నిర్వహించిన డీఎస్సీపై ప్రజావాణిని బలపరిచింది. తన హయాంలో జరిగిన ఏపీపీఎస్సీ అక్రమాలపై నోరు విప్పే ధైర్యం జగన్ కు లేదు. పరీక్ష పత్రాల మూల్యాంకనం ముసుగులో తానుచేయించిన అక్రమాలపై ప్రజా ప్రభుత్వం తనను ఏకిపారేస్తుందన్న భయంతోనే జగన్ అసెంబ్లీకి ముఖం చాటేస్తున్నాడు. ప్రజలు తిరస్కరించిన ప్రతిపక్ష హోదాపై జగన్ మంకుపట్టు పట్టడం.. హోదా ఇస్తేనే సభకు వస్తామని పిడివాదనం చేయడం ఆయనలోని పిరికితనానికి నిదర్శనం. గతంలో చంద్రబాబుకు ప్రతిపక్ష హెదా లేకుండా చేస్తానని ప్రగల్భాలు పలికిన జగన్.. .నేడు దానికోసమే చంద్రబాబును వేడుకునే దుస్థితికి దిగజారాడు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించలేని జగన్ అసమర్థతను కళ్లారా చూసినందునే 2024 ఎన్నికల్లో ప్రజలు వైసీపీని ఏహోదాకు పనికిరాని పార్టీగా తేల్చారు. ఏపీ ప్రభుత్వం, ప్రధానాధికారులు డీఎస్సీలో ఎలాంటి అక్రమాలు లేవని ఆధారాలతో సహా స్పష్టం చేసినా, తమ పార్టీ నేతలు డీఎస్సీ అక్రమాలపేరుతో వేసిన పిల్ (ప్రజా ప్రయోజన వ్యాజ్యాల్ని) లను న్యాయస్థానాలు తిరస్కరించినా వైసీపీనేతలు పదేపదే అదే అంశాన్ని రాజకీయంగా తమకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

### డీఎస్సీపై జగన్ వైఖరి ప్రజాస్వామ్యానికే హానికరం.

నిరుద్యోగులు, విద్యార్థుల్లో ఉన్న ఆవగింజంత అసంతృప్తికి ఆజ్యంపోసి, రాష్ట్రంలో చిచ్చు పెట్టాలన్న జగన్ కుట్ర రాజకీయాల్ని డీఎస్సీ 2025 ఉపాధ్యాయులు చిదిమేశారు. డీఎస్సీపై జగన్ వైఖరి ముమ్మాటికీ ప్రజాస్వామ్యానికే ప్రమాదకరమని ప్రత్తిపాటి పేర్కొన్నారను. లోకేశ్ రాజీనామా డిమాండ్ తో ప్రజల్లో గొడ్డలిపార్టీ ప్రతిష్ట పెంచాలనుకున్న జగన్ ప్రయత్నాలు ఆదిలోనే నీరుగారిపోయాయి. చింతచచ్చినా పులుపు చావదన్నట్టు ప్రజలు గత ఎన్నికల్లో జీవితాంతం గుర్తుండిపోయేలా బుద్ధిచెప్పినా.. జగన్ కుట్రలు, కుతంత్రాలు, నీతిమాలిన రాజకీయాలు మానడం లేదు. జగన్ కు ఏమాత్రం ప్రజా సమస్యలపై, రాష్ట్రభవిష్యత్ పై చిత్తశుద్ధి ఉంటే.. అసెంబ్లీకి వచ్చి తన గళం వినిపించాలి. తాను లేవనెత్తే ప్రతి అంశానికి ప్రభుత్వం సమాధానం ఇచ్చేలా చూస్తానని, స్వయంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడే భరోసా ఇస్తున్నా.. గౌరవ సభలో అడుగుపెట్టడానికి జగన్ వణికిపోతున్నాడు. ” అని ఎద్దేవా చేశారు.

# మంత్రి ఆనం చొరవతో అలఘునాధుని ఆలయానికి పునర్వైభవం



ఆత్మకూరు (చైతన్యరథం): పట్టణంలోని చారిత్రాత్మక అలగనాథ స్వామి ఆలయంలో అంగరంగ వైభవంగా ఆలయ కళ్యాణ మండప ప్రారంభోత్సవం జరిగింది. రూ.80 లక్షల దేవాదాయ శాఖ నిధులతో నూతనంగా నిర్మించిన కళ్యాణ మండపాన్ని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రారంభించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, భక్తులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఆత్మకూరు ప్రాంత ఆధ్యాత్మిక వైభవాన్ని మరింత పెంపొందించేలా ఆలయ అభివృద్ధికి మంత్రి ఆనం అందిస్తున్న సహకారం పట్ల మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భక్తులు ప్రతి నెల శ్రవణ నక్షత్రం రోజున స్వామివారి కళ్యాణోత్సవం నిర్వహించుకునేందుకు ప్రత్యేక కళ్యాణ మండపం నిర్మాణానికి రూ.80 లక్షలు నిధులు మంజూరు చేయించడమే గాక పనులను చురుగ్గా చేయించి ప్రారంభించారు. క్రీస్తుశకం 1247లో తెలుగు చోళ రాజులు నిర్మించిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ అలగనాథ స్వామివారి ఆలయం ఆత్మకూరు ప్రాంత ఆధ్యాత్మిక, చారిత్రక వైభవానికి ప్రతీకగా నిలుస్తుంది. కాలక్రమేణా శిథిలావస్థకు చేరిన ఆలయం గ్రామ ప్రజల సంకల్పం, దాతల సహకారం, మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కృషితో పునరుద్ధరించబడి ప్రాచీన వైభవాన్ని సంతరించుకుంది.



# టీడీపీలోకి భారీగా చేరికలు

### కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే అశోక్ రెడ్డి

గిద్దలూరు (చైతన్యరథం): పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గిద్దలూరు మండలంలోని నరవ బయనపల్లె గ్రామానికి చెందిన పలువురు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ పార్టీకి చెందిన పలువురు కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. నరవ బయనపల్లె గ్రామానికి చెందిన బయనపల్లె బాబాయ్, బూనబోయిన శేఖర్ ఆధ్వర్యంలో పెట్టెల రామ్మోహన్ యాదవ్, శ్రీనివాసులు, చిన్న ఖాదరయ్య , సురేంద్ర, సాయికృష్ణ, శ్రీరాములు, రామాంజనేయులు, బుడతా లక్ష్మయ్య, దగ్గెపోగు పిలిప్ తదితరులు వైసీపీ పార్టీకి చెందిన పలువురు నేతలు కలిపి సుమారుగా 15 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా గౌరవ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ సిద్ధాంతాలు, కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పెద్ద సంఖ్యలో ప్రజలు టీడీపీలో చేరడం పట్ల ఎమ్మెల్యే అశోక్ రెడ్డి గారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నరవ బయనపల్లె గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు సేవలు అభినందనీయం



కోవూరు (చైతన్యరథం): నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు రక్షణగా నిలుస్తూ పోలీసులు అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. ఆదివారం కొడవలూరులో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారి సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో కొడవలూరు, విడవలూరు, ఇందుకూరుపేట ఎస్సైలకు బొలెరో వాహనాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆమె తనయులు, తెలుగుదేశం యువ నాయకులు డాక్టర్ అర్జున్ రెడ్డి పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసర సమయాల్లో పోలీసులు సకాలంలో ఘటనా స్థలాలకు చేరుకోవడంలో ఎదురవుతున్న ఇబ్బందులను గుర్తించి, వారి విధుల నిర్వహణకు మరింత సౌకర్యంగా ఉండేలా రెండో విడతగా ఈ వాహనాలను అందించినట్లు ప్రశాంతి రెడ్డి గారు తెలిపారు. పోలీసులు ఎలాంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని ఆమె సూచించారు. అవినీతి, అక్రమాల విషయంలో ఎలాంటి తారతమ్యాలు లేకుండా కఠినంగా వ్యవహరించాలని, ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయడం ద్వారా నియోజకవర్గంలో శాంతిభద్రతలను మరింత సమర్థవంతంగా పరిరక్షించగలమని ఆమె పేర్కొన్నారు. ప్రజలకు అండగా 24 గంటలూ నిరంతరం సేవలందిస్తున్న పోలీసు సిబ్బందికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల, డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు , కొడవలూరు ఎస్సై కోటిరెడ్డి , విడవలూరు ఎస్సై సాయి కళ్యాణ్ , ఇందుకూరుపేట ఎస్సై నవీన్ కుమార్, కూటమి నాయకులు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# చౌకచర్లలో రూ.2.90 కోట్ల అభివృద్ధి పనులు

కోవూరు (చైతన్యరథం): గడిచిన రెండేళ్ల కాలంలో చౌకచర్ల పంచాయతీ పరిధిలో మొత్తం రూ. 2,90,40,000 విలువైన సంక్షేమ, అభివృద్ధి పనులు చేపట్టినట్లు ప్రశాంతి రెడ్డి గణాంకాలతో వివరించారు. ఇరిగేషన్ శాఖ ద్వారా రూ. 58,35,000 వెచ్చించగా, ఇందులో చౌకచర్ల చెరువు కాలువ, తూము కాలువల్లో గుర్రపు డెక్క తొలగింపునకు రూ. 13,50,000, తూము షట్టర్ మరమ్మతుకు రూ. 5,00,000, నీటి సరఫరా కాలువ అభివృద్ధికి రూ. 15,00,000 కేటాయించారు. అలాగే స్లూయిస్ కాలువల పునరుద్ధరణ, రక్షణ గోడల నిర్మాణానికి రూ. 14,90,000, ఆయకట్టు రహదారి మరమ్మతులకు రూ. 9,95,000 ఖర్చు చేశారు.

విద్యుత్తు శాఖ పరిధిలో ఏకంగా రూ. 1,09,20,000 విలువైన పనులు చేపట్టగా, ఆర్డీఎస్ఎస్ కింద రూ. 60,00,000తో పనులు నిర్వహించారు. విద్యుత్ పోల్స్, కండక్టర్ రీప్లేస్‌మెంట్‌కు రూ.2,20,000 వెచ్చించడంతో పాటు ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కింద 47 ఇళ్లకు రూ. 47,00,000 అంచనా వ్యయంతో సోలార్ రూఫ్‌టాప్ కనెక్షన్లు కల్పించారు. పంచాయతీ రాజ్ శాఖ ద్వారా రూ. 56,00,000 కేటాయించి, పసలవారిపాళెం, మిక్స్ కాలనీలలో 4 సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 20,00,000, ఐదేళ్లుగా అసంపూర్తిగా ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు రూ. 36,00,000 వ్యయం చేశారు. తాగునీరు, పారిశుద్ధ్య రంగాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా రూ. 50,00,000 ఖర్చు చేయగా, ఇందులో సైడ్ డ్రైయిన్ల నిర్మాణానికి రూ. 32,00,000, తాగునీటి బోర్లు, పైప్‌లైన్ల ఏర్పాటుకు రూ. 18,00,000 వినియోగించారు. ఇవే కాకుండా గ్రామంలో సొంత స్థలం ఉన్న 76 పేద కుటుంబాల ఇళ్ల నిర్మాణ ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపామని, త్వరలోనే ఇవి మంజూరవుతాయని ఎమ్మెల్యే వెల్లడించారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా స్థానిక ప్రజలు కాలువలు, రోడ్ల నిర్మాణంతో పాటు వాటర్ పంపు, వాటర్ ప్లాంట్ మరమ్మతులు చేయాలని ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యలను త్వరలోనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ప్రశాంతి రెడ్డి హామీ ఇచ్చారు.

# అంగన్వాడీ అభ్యర్థులకు నియామక పత్రాలు



### ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి చేతుల మీదుగా 338 కేంద్రాలకు ఎలక్ట్రిక్ స్టవ్‌లు, ప్రెషర్ కుక్కర్లు పంపిణీ

కావలి (చైతన్యరథం): కావలి ఎమ్మెల్యే కార్యాలయంలో నూతనంగా ఎంపికైన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు (సహాయకులు) నియామక పత్రాల అందజేత కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అభ్యర్థులకు అధికారులతో కలిసి 21 మందికి నియామక పత్రాలను స్వయంగా అందించారు.?ఈ సందర్భంగా ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. సమాజ వికాసంలో అంగన్‌వాడీ కార్యకర్తల బాధ్యత అత్యంత కీలకమైనదని అన్నారు. చిన్నారుల ఆరోగ్యం, పోషణ, ప్రాథమిక విద్యాభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలే పునాది అని స్పష్టం చేశారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు గర్భిణులు, బాలింతలకు సంక్షేమ సేవలు అందిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది నిబద్ధతను ఎమ్మెల్యే అభినందించారు. కావలి నియోజక వర్గంలో 21 మందికి నియామక పత్రాల అత్త వాళ్ళ అందజేయడం చాలా సంతోషంగా ఉందని.. కరప్షన్ అనేది లేకుండా నిజమైన అర్హులకు అందజేయడం జరిగిందని ప్రతి ఒక్కరు కష్టతరం మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే కోరారు. అనంతరం నియోజకవర్గ పరిధిలోని 338 అంగన్‌వాడీ కేంద్రాలకు ఎలక్ట్రిక్ స్టవ్‌లు, ప్రెషర్ కుక్కర్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. వంట ప్రక్రియను వేగవంతం చేసి, చిన్నారులకు సకాలంలో నాణ్యమైన పౌష్టికాహారం అందించేందుకు ఈ పరికరాలు తోడ్పడతాయని ఎమ్మెల్యే తెలిపారు.?ఈ కార్యక్రమంలో ఎం. రాజ్యలక్ష్మి, కావలి రూరల్ మండలం అధ్యక్షులు ఆవుల రామకృష్ణ, బోగోలు మండలం టిడిపి మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, కావలి పట్టణ మహిళా అధ్యక్షురాలు హర్షియా బేగం, అంగన్వాడి సూపర్‌వైజర్లు వి. హేమావతి, ఎం. సౌజన్య, కార్యాలయ సిబ్బంది పి.జయ ప్రకాష్, సాయి ప్రవీణ్, ఈ. లక్ష్మీరాజ్యం పాల్గొన్నారు. వివిధ శాఖల అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

జోన్-5
(నంద్యాల, కర్నూలు, హిందూపురం, అనంతపురం, కడప)
చైతన్యరథం



# ప్రజలు, కార్యకర్తలే నాకు తొలి ప్రాధాన్యం

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు (చైతన్యరథం): నాలుగు సార్లు నన్ను గెలిపించి ఎమ్మెల్యేగా చేసిన.. ప్రజలకు, కార్యకర్తలకు ఏం ఇచ్చినా తక్కువేనని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆమె సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని 6మండలాలకు చెందిన 52మందికి రూ.54.39లక్షల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలు, మండలాల నాయకులు, లబ్ధిదారుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు. చెక్కులు అందుకున్న వారు ఎమ్మెల్యే సునీతతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ రెండేళ్లలో 1430 మందికి సీఎంఆర్ఎఫ్ ద్వారా 11 కోట్ల రూపాయలు అందజేసినట్టు తెలిపారు. గతంలో ఎప్పుడూ ఇంత పెద్ద ఎత్తున సాయం అందలేదన్నారు. అనారోగ్య కారణాలతో ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్న వారికి ఇది ఎంతగానో ఊరటనిస్తోందన్నారు. నా వద్దకు ఎవరైనా సరే ఈ సాయం కోసం వస్తే కాదనకుండా ముఖ్యమంత్రి వద్దకు ఫైల్ తీసుకెళ్తున్నానని చెప్పారు. తనను నమ్మి ఓట్లు వేసిన ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి చేయడమే కాకుండా.. ఇలా వ్యక్తిగతంగా కూడా సాయం చేయడం నా బాధ్యత అన్నారు. ఏ కార్యకర్త, నాయకుడికైనా సరే ఏ కష్టం వచ్చినా నేను ఉంటానన్నారు.

### ఇంటింటికీ టీడీపీ వేగవంతం చేయండి

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సునీత పార్టీ నాయకులకు ఆదేశించారు. తన క్యాంప్ కార్యాలయంలో పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం జరుగుతున్న డోర్ టూ డోర్ కార్యక్రమం, సర్ ప్రక్రియ మీద సమీక్ష నిర్వహించారు. డోర్ టు డోర్ కార్యక్రమంలో 100 ఇళ్ల కంటే తక్కువ తిరిగిన బూత్ ల గురించి, ఇప్పటి వరకు 50శాతం లోపు ఉన్న వాటి గురించి ప్రధానంగా ప్రస్తావించారు. కార్యక్రమం ప్రారంభమై 20రోజులు గడుస్తున్నా.. ఎందుకు ఇంత నెమ్మది సాగుతోందని ఆరా తీశారు. పార్టీ ఏదైనా నిర్దేశించినప్పుడు దానిని కచ్చితంగా చేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడ్డవారికే ప్రధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. మరోవైపు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో భాగంగా అందజేసిన నోటీసులను పరిశీలించి వివరణ ఇవ్వాలని, ఓటరు జాబితాలో తప్పులు, అభ్యంతరాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఎవరైనా ఓట్లు కోల్పోయి ఉన్నా... లేదా కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియపై దృష్టి సారించాలని ఆదేశించారు.

# రెచ్చగొట్టకుండా గజరాజుల కట్టడి చేయండి : ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం


చిత్తూరు (చైతన్యరథం): జిల్లాల్లోని చంద్రగిరి సమీప ప్రాంతాల్లో ఏనుగుల సంచారం నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అటవీ ప్రాంతాలకు సమీపంలోని గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఏనుగుల కదలికలను నిరంతరం పర్యవేక్షించేందుకు డ్రోన్లను వినియోగించాలని, అటవీ సమీప గ్రామాల్లో రాత్రివేళ గస్తీని మరింత పెంచాలని అధికారులకు స్పష్టం చేశారు. ఏనుగులు సంచరించే ప్రాంతాలను గుర్తించి ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని పవన్ కళ్యాణ్ సూచించారు. ఇందుకోసం రెవెన్యూ, పోలీసు, అటవీశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఏనుగుల కదలికలు కనిపించిన వెంటనే సమీప గ్రామాల ప్రజలను అప్రమత్తం చేసేలా సమాచార వ్యవస్థను బలోపేతం చేయాలని తెలిపారు. అటవీశాఖ ఆధ్వర్యంలో హనుమాన్ బృందాలను మోహరించి ఏనుగుల కదలికలను పర్యవేక్షించాలని అధికారులకు పవన్ కళ్యాణ్ ఆదేశాలు ఇచ్చారు. ఏనుగులను రెచ్చగొట్టకుండా, వాటికి ఆటంకం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదే సమయంలో ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. చంద్రగిరి పరిసర గ్రామాల్లో ఏనుగుల సంచారంపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు, అత్యవసర పరిస్థితుల్లో అధికారులు తక్షణమే స్పందించేలా చర్యలు చేపట్టాలని పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం చేశారు. అటవీ సమీప ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఏనుగులు కనిపిస్తే వాటికి దూరంగా ఉండి అధికారులకు సమాచారం అందించాలని పవన్ కళ్యాణ్ మార్గనిర్దేశం చేశారు.



తుంగభద్ర జలాశయంలో నీటి నిల్వ 87.45 టీఎంసీలకు చేరింది. జలాశయం నీటిమట్టం 1,628.20 అడుగులకు చేరింది. గత 24 గంటల్లో సగటున 26,834 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. ప్రస్తుతం 23,290 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. జలాశయం నుంచి వివిధ కాలువలకు 2,226 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

# సభకు వెళ్లకపోవడం సబబు కాదు

## జగన్‌కు మాజీమంత్రి రఘువీరారెడ్డి హితవు




కర్నూలు (చైతన్యరథం): ఏపీ అసెంబ్లీ సమావేశాలకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వెళ్లాలని, సభకు వెళ్లకపోవడం సరికాదని సీడబ్ల్యూసీ సభ్యులు, మాజీమంత్రి రఘువీరారెడ్డి పేర్కొన్నారు. కర్నూలు నగరంలోని కిసాన్ ఘాట్‌లో దివంగత మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి 106వ జయంతిని ఆదివారం నిర్వహించారు. కోట్ల విజయ భాస్కర్ రెడ్డికి రఘువీరారెడ్డి, డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాశ్ రెడ్డి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రఘువీరారెడ్డి మాట్లాడారు. జగన్ పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లాలని.. ఎల్‌నినోపై చర్చించాలని సూచించారు. ప్రతిపక్షంలో ఉండాల్సిన వైసీపీ అసెంబ్లీకి ఎందుకెళ్లట్లేదని ప్రశ్నించారు.

### ఎల్‌నినోపై అసెంబ్లీలో చర్చించాలి..

ఏపీలో జగన్ ఐదేళ్లు పాలన చేశారని.. అసెంబ్లీకి వెళ్లి ఎల్‌నినోపై సలహాలు ఇవ్వొచ్చు కదా అని రఘువీరారెడ్డి నిలదీశారు. ఎల్‌నినో వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. ఈ విషయంపై అసెంబ్లీలో చర్చించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సభలో కీలక నిర్ణయాలు తీసుకుని కేంద్రప్రభుత్వ సహకారంతో రైతులను ఆదుకోవాలని కోరారు.

మేధో నక్సల్స్ అన్న మాటను ప్రధానమంత్రి నరేంద్రమోదీ వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### శ్రీశైలం ప్రాజెక్టులో వెంటనే విద్యుత్ ఉత్పత్తి నిలిపి వేయాలి..

శ్రీశైలం ప్రాజెక్టులో వెంటనే విద్యుత్ ఉత్పత్తి నిలిపి వేయాలని రఘువీరారెడ్డి కోరారు. ఎందుకంటే ఎగువ నుంచి వరద రాకపోతే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని తెలిపారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా కృష్ణా జలాల వినియోగంపై తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చర్చిస్తే.. జలవివాదాలు తలెత్తవని అన్నారు. ఎల్‌నినో గండం నుంచి రైతులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని రఘువీరారెడ్డి సూచించారు.

# ఎన్నో ఏళ్లకు నెరవేరిన కల

కైకలూరు (చైతన్యరథం): నియోజకవర్గ పరిధిలోని కొల్లేరు లంక గ్రామాల ప్రజల నాలుగు దశాబ్దాల కల సాకారమైంది. ఇప్పటివరకూ రవాణా సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పెద్దట్లగాడి, పెనుమాక లంక, ఇంగిలిపాక లంక గ్రామాలకు తొలిసారిగా ఆర్టీసీ బస్సు సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఏలూరు నుంచి ఈ లంక గ్రామాల వరకూ నడిచే ఆర్టీసీ బస్సు సర్వీసును ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, ఆర్టీసీ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు జెండా ఊపి ప్రారంభించారు. బస్సు సౌకర్యం అందుబాటులోకి రావడంతో లంక గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు, మహిళలు, వృద్ధులు రాకపోకలకు పడుతున్న ఇబ్బందులు ఇకపై తగ్గనున్నాయని స్థానికులు పేర్కొన్నారు. బస్సు సర్వీసు ప్రారంభోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ స్వయంగా బస్సులో టికెట్ తీసుకుని ప్రయాణించారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణతో పాటు కూటమి నాయకులు కూడా బస్సులో ప్రయాణించి లంక గ్రామాల ప్రజలతో మమేకమయ్యారు. తమ ప్రాంతానికి బస్సు రావడం ఎంతో సంతోషంగా ఉందని, అత్యవసర సమయాల్లో ఆసుపత్రులకు వెళ్లేందుకు, విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు చేరేందుకు, రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించేందుకు ఈ సర్వీసు ఎంతో ఉపయోగపడుతుందని గ్రామస్తులు తెలిపారు. ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న ప్రజల రవాణా సమస్యకు పరిష్కారం లభించడంతో స్థానికుల్లో ఆనందం నెలకొంది. రహదారి నిర్మాణానికి కృషి చేసిన గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.



# వాషింగ్టన్‌లో భారత స్వాతంత్ర్య వేడుకలు





**వాషింగ్టన్ డీసీ:** బృహత్తర వాషింగ్టన్ తెలుగు సాంస్కృతిక సంఘం(జీడబ్ల్యూటీసీఎస్) ఆధ్వర్యంలో 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడు రవి అడుసుమిల్లి, కార్యదర్శి భానుప్రకాష్ మాగులూరి నేతృత్వంలో ప్రవాస భారతీయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జాతీయ జెండాను ఆవిష్కరించి జెండా వందనం నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ గాంధీజీ, లాల్ బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు ఘన నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

**దేశ ప్రగతికి పునరంకితం కావాలి**

రవి అడుసుమిల్లి మాట్లాడుతూ ప్రపంచానికి అహింసా మార్గాన్ని ప్రబోధించిన మహాత్మాగాంధీతో పాటు స్వాతంత్ర్యం కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయుల జీవితాలు మనందరికీ ఆదర్శం.. తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాడిన స్వాతంత్ర్య సమరయోధులు, అహింసావాదుల త్యాగాల ఫలితమే నేటి స్వతంత్ర భారతమని పేర్కొన్నారు. గురజాడ అప్పారావు చెప్పిన మాటలను గుర్తు చేస్తూ దేశభక్తి మాటల్లోనే కాకుండా ఆచరణలోనూ ప్రతిబింబించాలని పేర్కొన్నారు. ప్రవాస భారతీయులు ఎక్కడ ఉన్నా మాతృభూమి, మాతృభాష, భారతీయ సంస్కృతి పట్ల బాధ్యతతో ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. యువతే దేశానికి బలం, భవిష్యత్తు..జాతీయ



సమైక్యత, సహోదరభావం, పరస్పర గౌరవాన్ని పెంపొందించడం ప్రతిఒక్కరి కర్తవ్యమన్నారు. అనంతరం భారత రాయబార కార్యాలయంలో రాయబారి వినయ్‌మోహన్ క్వాత్రాను కలిసిన ఉప్పుటూరి రామ్‌చౌదరి, భానుప్రకాష్ మాగులూరి, ప్రవాస పెద్దలు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీతారామారావు ఎండూరు, చంద్రనాథ్ నంబూరు, వల్లభనేని వీరభద్రరావు, కందుల అభిరామ్, చింతా రాంబాబు, శ్రీకాకుల రామ సత్యనారాయణ, అన్నం పూర్ణచంద్రరావు, రాధాకృష్ణ మైనేని, ఐతా భిక్షపతి, సూరేపల్లి బ్రహ్మం, సి.హెచ్.సత్యనారాయణ, చిట్టెల సుబ్బారావు, జంపాల కృష్ణమోహన్, డాక్టర్ అల్లం లింగం, యోగానంద్ వంకిన, గంగారావు పొనగోటి, భాస్కరరావు చీటి, సత్తయ్య మారిశెట్టి, చెరుకూరి ఇందుశేఖర్, పి.నర్సింగరావు, యాదగిరి గుండా పాల్గొన్నారు.

## 'పాంచాలి పంచభర్తృక' సినిమాకు స్పందన

### హాస్యం, డైలాగ్స్‌కు థియేటర్స్‌లో నవ్వులే నవ్వులు



**అట్లాంటా/జార్జియా:** డాక్టర్ రాజేంద్రప్రసాద్ ప్రధాన పాత్రలో..గంగా సప్తశిఖర దర్శకత్వంలో తెరకెక్కెన కామెడీ సస్పెన్స్ థ్రిల్లర్ 'పాంచాలి పంచభర్తృక' సినిమా ఆగస్టు 14వ ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుదు వచ్చింది. రాయల్ థ్రోన్ ప్రొడక్షన్స్, ఓం సాయిరామ్ ఆర్ట్స్ బ్యానర్‌పై వెంకట్ దుగ్గిరెడ్డి, రాజ పవన్, శ్రీకాంత్ సెట్టివారి, సాయినాథ్ మన్యం నిర్మించిన ఈ చిత్రం వినోదం, కామెడీ, సస్పెన్స్ అందాల మేళవింపుతో రూపొందింది. ఈ సినిమాలో రాజేంద్రప్రసాద్, కమెడియన్ పృథ్వీ, రోల్ రీడా, జెమిని సురేష్, శ్రీకాంత్ అయ్యంగార్, సరీఫ్ ఫార్, అట్లాంటా నుంచి వెంకట్ దుగ్గిరెడ్డి, పవన్ పూసర్ల ప్రధాన పాత్రల్లో నటించారు. వెంకట్ దుగ్గిరెడ్డి ఇప్పటికే దాదాపు 12 సినిమాలలో నటించారు. ఈ సినిమాలో అటు నెల్లూరు మాడ్యులేషన్ ఇటు కామెడీ టైమింగ్‌తో నవ్వులు పూయించారు. పవన్ పూసర్ల టాలీవుడ్‌లో మొట్టమొదటి సినిమాతోనే ప్రేక్షకలను అలరిస్తున్నారు. బంతిపువ్వ బాబ్జి, పిడుగు పుష్పరాజ్, బేబీ స్టార్ బాబ్జి వంటి ఫన్నీ పేర్లతో థియేటర్స్‌ని నవ్వులతో నింపేశారు. లెస్ లాజిక్ మోర్ మ్యాజిక్ అంటూ నవ్వులు పంచేలా ఈ సినిమా సరదాగా సాగు తుంది. కథ విషయానికి వస్తే నలుగురు వ్యక్తులు అనుకోకుండా ఓ విదేశీ యువతి మరణం చుట్టూ చిక్కుల్లో పడటం, ఆ యువతికి అండర్ వరల్డ్ డాన్‌తో సంబంధం ఉండటం, ఆ సమస్య నుంచి బయటపడేందుడు వారు చేసే ప్రయత్నాలు సినిమాను అసక్తికరంగా ముందుదు తీసుకెళతాయి. మహేష్ నారాయణ సంగీతం అందించిన ఈ చిత్రానికి జానీ బాషా నాగ ఎడిటర్‌గా, కేవీ ప్రసాద్ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేశారు. కుటుంబ ప్రేక్షకులను లక్ష్యంగా వినోదాత్మక చిత్రంగా నిలిచింది. ముఖ్యంగా డాన్ ఎవరనేది చివరివరకు సీక్రెట్టే. అట్లాంటా జానపద జనార్దన్ ఈ సినిమాకు టైటిల్ సాంగ్ పాడటం విశేషం. ఈ మధ్య సోషల్ మీడియాలో పాపులర్ అయిన కొంతమందిని ఈ సినిమాలో చూస్తారు. ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తుంది. చిత్రబృందం కూడా ప్రేక్షకుల ఆదరణపై ఆనందం వ్యక్తం చేస్తోంది.

# టీసీఏ ఆధ్వర్యంలో శ్రీనివాస కళ్యాణం

- భక్తి పారవశ్యంతో మునిగిన మిస్సి సాగా నగరం
- పిట్స్‌బర్గ్ వేంకటేశ్వర టెంపుల్ 50వ వార్షికోత్సవం
- భక్తులకు తిరుమల లడ్డూ ప్రసాదం వితరణ











**కెనడా:** తెలంగాణ కెనడా అసోసియేషన్ ఆధ్వర్యంలో వెంకటేశ్వర టెంపుల్, పిట్స్‌బర్గ్ వారి సహకారంతో శ్రీనివాస కల్యాణం కెనడాలోని మిస్సిసాగా నగరంలో అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సుప్రభాతం, అభిషేకం, అలంకరణ, కల్యాణం ఆచార క్రమాన్ని అనుసరించి ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తులను భక్తి పారవశ్యంతో ముంచెత్తింది. పిట్స్‌బర్గ్ వెంకటేశ్వర టెంపుల్ 50వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం జరిగింది. పీట్స్‌బర్గ్ టెంపుల్ నిర్వాహకులు దేవతామూర్తులను పిట్స్‌బర్గ్ వెలుపలికి తీసుకువచ్చి కల్యాణాన్ని నిర్వహించడం ఇదే మొదటిసారి కావడం విశేషం. కల్యాణోత్సవంలో వెంకటేశ్వర టెంపుల్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ కొత్తపల్లి, సెక్రటరీ హరీన్‌కొండ, అర్చకులు సంతోష్‌కుమార్ చార్యులు, భక్తులు, సాధారణ ప్రజలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు స్టాల్స్ ఏర్పాటు చేశారు. స్థానిక వ్యాపార సంస్థలు, శ్రేయోభిలాషులు, స్పాన్సర్లు స్వయంగా హాజరయ్యారు. తిరుమల నుంచి ప్రత్యేకంగా తీసుకువచ్చిన లడ్డూ ప్రసాదంతో పాటు పులిహోర, దద్దోజనం వితరణ చేశారు.

**ఇది ఒక ప్రత్యేకమైన ఆరంభం: మన్నెం**

తెలంగాణ కెనడా అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ మన్నెం మాట్లాడుతూ ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి భక్తునికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. పిట్స్‌బర్గ్ వెలుపల తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక కళ్యాణ కార్యక్రమానికి భాగస్వామిగా ఉండటం తమకు గర్వకారణమని తెలిపారు. ఇది ఒక ప్రత్యేకమైన ఆరంభమని, పిట్స్‌బర్గ్ వెలుపల మరెన్నో ఇలాంటి కల్యాణాలు జరగడానికి ఇది మార్గం సుగమం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని టీసీఏ కార్యవర్గం, బోర్డు ఆఫ్ ట్రస్టీస్, వ్యవస్థాపక సభ్యులు, స్వచ్ఛంద సేవకులు సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమ విజయవంతానికి సహకరించిన వెంకటేశ్వర టెంపుల్, పిట్స్‌బర్గ్ వారికి తెలంగాణ కెనడా అసోసియేషన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ మన్నెం, ఉపాధ్యకులు శంతన్ నారెళ్ళపల్లి, కార్యదర్శి శంకర్ భరద్వాజ పోపూరి, సాంస్కృతిక కార్యదర్శి స్ఫూర్తి కొప్పు, సంయుక్త కార్యదర్శి ప్రణీత్ పాలడుగు, కోశాధికారి రాజేష్ అర్ర, డైరెక్టర్లు శ్రీరంజని కందూరి, కోటేశ్వర్ చెట్టిపెల్లి, శరత్ యరమల్ల, బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ చైర్మన్ నవీన్ ఆకుల, బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ సభ్యులు మాధురి చాతరాజు, వ్యవస్థాపక సభ్యులు కోటేశ్వరరావు చిత్తలూరి, అఖిలేష్ బెజ్జంకి, దేవేందర్‌రెడ్డి గుజ్జుల, శ్రీనివాస తిరునగరి, విజయ్‌కుమార్ తిరుమలపురం, సంతోష్ గజవాడ, సంస్థ శ్రేయోభిలాషులు, సుమారు 1000 మంది భక్తులు పాల్గొన్నారు.

చైతన్యరథం





# సోనియా క్షమాపణ చెప్పాలి

## 'పూర్తి వందేమాతరం' వివాదంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా

కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీపై కేంద్ర హోంమంత్రి అమిత్ విమర్శలు గుప్పించారు. శనివారం జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో వందేమాతరం పూర్తి గేయాన్ని ఆలపించకుండా సోనియా అడ్డుకున్నారని ఆరోపించారు. ఈ ఘటనను దేశ ప్రజలందరూ కళ్లారా చూశారని పేర్కొన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం జాతీయ గేయాన్ని అవమానించారని మండిపడ్డారు. ఆ పార్టీని దేశ ప్రజలు ఎన్నటికీ క్షమించరని అన్నారు. వందేమాతరాన్ని అవమానించినందుకు దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇటువంటి చర్యలు సిగ్గుచేటని విమర్శించారు. రాజస్థాన్‌లోని చిత్తోర్‌గఢ్‌లో నిర్వహించిన ర్యాలీలో ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు.

**పోలీసుల అదుపులో విద్యార్థులు..**

అమిత్ షా పర్యటనకు ముందు కాంగ్రెస్ నాయకులతోపాటు పలువురు విద్యార్థులను రాజస్థాన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అమిత్ ర్యాలీ నేపథ్యంలో నిరసన చేపట్టడానికి విద్యార్థులతో పాటు ఇరవై నాలుగుమంది కాంగ్రెస్ నేతలు ప్రయత్నించారు. పేపర్ లీకులు, దిల్లీలో విద్యార్థులపై దాడులపై కేంద్రమంత్రి స్పందించాలని డిమాండ్ చేస్తూ.. నిరసన చేపట్టారు. దీంతో వారిని అక్కడి నుంచి బలవంతంగా తరలించారు. ఈ అరెస్టులకు నిరసనగా వందలాది కాంగ్రెస్ కార్యకర్తలు, విద్యార్థులు పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు.

**జెండా వందనం సందర్భంగా..**

వందేమాతరం పూర్తి గేయాన్ని ఆలపించకుండా ఆ పార్టీ అగ్రనేత సోనియాగాంధీ మధ్యలోనే అడ్డుకున్నారని భాజపా ఆరోపించింది. దీనికి సంబంధించిన వీడియో పార్టీ ప్రధాన కార్యదర్శి బిఎల్ సంతోష్ సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. "తల్లి, తనయుడు, ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు పూర్తి వందేమాతరాన్ని ఆలపించడానికి ఇష్టపడుతున్నట్టు లేదు. కొందరి ఆలోచనాధోరణి 1947కి పూర్వం ఎలా ఉందో ఆ తర్వాతా అలాగే ఉంది" అని విమర్శించారు.

వందేమాతరం గేయాన్ని అవమానించారంటూ కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీపై కేసు నమోదైంది. కర్ణాటకలోని మంగళూరుకు చెందిన బీజేపీ నాయకుడు వికాస్ పుట్టూర్.. స్థానిక ఉర్వా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. శనివారం ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో జరిగిన స్వాతంత్ర్య దిన వేడుకల సందర్భంగా వందేమాతరం గేయాన్ని సోనియా అవమానపరిచారని, ఆమెపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరాడు. ఒకవేళ పోలీసులు లేదా రాష్ట్ర ప్రభుత్వం తగిన రీతిలో స్పందించకుంటే కర్ణాటక హైకోర్టును ఆశ్రయిస్తానని పేర్కొన్నాడు. ప్రస్తుతం ఈ కేసుకు సంబంధించిన అంశాల్ని పోలీసులు పరిశీలిస్తున్నారు. సోనియాకు వ్యతిరేకంగా ఇప్పటివరకు ఇంకా ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు కాలేదని తెలుస్తోంది.

# వాళ్లే.. 'ధిమాగీ నక్సల్స్'

## విపక్షాల విమర్శలపై కిరణ్ రిజుజు

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి చేసిన ప్రసంగంలో 'దిమాగీ నక్సల్స' అంటూ కొత్త చర్చకు తెరలేపారు ప్రధాని మోదీ. దేశంలో సాయుధ నక్సలిజాన్ని నిర్మూలించామని, అయితే మేధో నక్సలిజం ఇంకా పొంచి ఉందని, దానినుంచి ప్రమాదం పోలేదని ప్రధాని హెచ్చరించారు. దీంతో అధికార పక్షంపై విపక్షాలు విమర్శలు ఎక్కుపెట్టాయి. ప్రధాని మోదీ ప్రతిపక్షాలనుద్దేశించి అనలేదని, మావోయిస్టు, వేర్పాటువాద భావజాలం ఉన్నవారిని ఉద్దేశించి అన్నారంటూ కేంద్రమంత్రి కిరణ్ రిజిజు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. ప్రధాని మోదీ వ్యాఖ్యల నేపథ్యంలో "దిమాగీ నక్సల్ అయినందుకు గర్వంగా ఉంది" అంటూ కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం ఓ పోస్ట్ పెట్టారు. దీనికి స్పందిస్తూ కిరణ్ రిజిజు పోస్ట్ పెట్టారు. "ప్రతిపక్ష నేతల్ని దిమాగీ నక్సల్స్ అని ప్రధాని మోదీ అనలేదు. రాజ్యాంగాన్ని తిరస్కరిస్తూ మావోయిస్టులకు మద్దతు ఇచ్చేవారు, వేర్పాటువాదాన్ని, ఆర్టికల్ 370ని సమర్థించేవారు, భారత్ నుంచి ఈశాన్య రాష్ట్రాలను వేరు చేయాలని చూసేవారు మాత్రమే దిమాగీ నక్సల్స" అని రిజిజు పేర్కొన్నారు. ఉపా కేసులో అరెస్టయిన శర్జీల్ ఇమాంను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 2020లో దిల్లీలో జరిగిన అల్లర్ల ఘటనలో శర్జీల్ అరెస్టయ్యాడు.



రిజిజు వ్యాఖ్యలపై కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ పవన్ ఖేరా విమర్శలు గుప్పించారు. 'సోదరా! ముందు మీరు నంబర్లు రాయడం నేర్చుకుని తర్వాత సమాధానాలు ఇవ్వండి. మీరు పెట్టిన పోస్టులో 1, 2 తర్వాత 3 వస్తుంది. 4 కాదు" అంటూ పోస్ట్ పెట్టారు. "ఎంటైర్ పొలిటికల్ సైన్స్‌లో అంతే" అంటూ ఖేరా కామెంటుకు మరో కాంగ్రెస్ నేత జైరామ్ రమేశ్ సెటైర్ వేశారు. అయితే, రిజిజు తన పోస్టును తర్వాత సవరించి నంబర్‌ను సరిచేశారు.



# అస్సాం సీఎంకు బెదిరింపు

## నిందితుడి అరెస్ట్

రూ.కోటి ఇస్తే అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మను హత్య చేస్తానని సామాజిక మాధ్యమంలో బెదిరించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. గువాహటిలోని ఖానాపారా వెటర్నరీ అండ్ అగ్రికల్చరల్ మైదానంలో సీఎం హిమంత బిశ్వ శర్మ శుక్రవారం మాట్లాడారు. ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం అవుతుండగా.. లైవ్ చాట్ సెక్షన్‌లో సదరు వ్యక్తి ఈ బెదిరింపులకు పాల్పడ్డాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు అతడితోపాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఆ చాట్‌లో నిందితుడు పాకిస్థాన్‌కు అనుకూలంగా నినాదాలు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిని మొరిగావ్ జిల్లాకు చెందిన అబ్దుల్ ముతలెబ్ గుర్తించారు.

# ఎల్పీజీ ఉత్పత్తి రెట్టింపు

## రోజుకు 63,810 టన్నుల ఉత్పత్తి
## లక్ష్యంగా 21 రిఫైనరీలకు కేంద్రం ఆదేశం

ఇరాన్ యుద్ధ ప్రభావంతో దేశవ్యాప్తంగా ఎల్పీజీ కొరత తీవ్రరూపం దాల్చిన నేపథ్యంలో, ఉత్పత్తిని భారీగా పెంచాలని కేంద్రం నిర్ణయించింది. గృహ, వాణిజ్య సిలిండర్ల లభ్యత క్షీణించి, బ్లాక్ మార్కెట్‌లో రెండు మూడు రెట్లు ఎక్కువ ధరలకు కొనాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు చమురు ఉత్పత్తి, రిఫైనరీ సంస్థలకు ఈనెల 13న కేంద్రం కీలక ఆదేశాలు జారీ చేసింది. రోజుకు 63,810 టన్నుల ఎల్పీజీ ఉత్పత్తి చేయాలని 21 రిఫైనరీలను ఆదేశించింది. ఈ లక్ష్యం అత్యంత భారీది. గత మార్చితో ముగిసిన 2026 ఆర్థిక సంవత్సరంలో నమోదైన ఎల్పీజీ ఉత్పత్తికి ఇది రెట్టింపుకు మించి ఉంది. అలాగే, ప్రస్తుతం దేశంలో ఒక రోజుకు వినియోగమవుతున్న గ్యాస్‌లో ఇది 70 శాతానికి సమానం. అయితే, ఇంత భారీ లక్ష్యాన్ని తక్షణమే చేరుకోవడం సాధ్యం కాదు. విదేశాల నుంచి చమురు సరఫరా తగినంతగా లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. హోర్ముజ్ జలసంధి కొద్ది రోజులుగా మూసి ఉండటంతో గల్ఫ్ దేశాల నుంచి వచ్చే ముడి చమురు పరిమాణం భారీగా పడిపోయింది. తగినంత చమురు దిగుమతి జరిగితేనే రిఫైనరీ కంపెనీలు ఈ లక్ష్యాన్ని అందుకోగలుగుతాయి.

దేశంలోని రిఫైనరీ కంపెనీల్లో 18 సంస్థలు ప్రభుత్వ రంగానికి చెందినవే. వీటికి రోజుకు 31,470 టన్నుల ఎల్పీజీ ఉత్పత్తి చేయాలని కేంద్రం లక్ష్యంగా నిర్దేశించింది. ప్రైవేటు రిఫైనరీల్లో అత్యధిక ఉత్పత్తి సామర్థ్యం రిలయన్స్‌దే. గుజరాత్‌లోని జామ్‌నగర్ రిఫైనరీ ద్వారా ఏడాదికి 33 మిలియన్ టన్నుల సామర్థ్యంతో, రోజుకు 18,000 టన్నుల ఎల్పీజీని ఈ సంస్థ ఉత్పత్తి చేయగలదు. ఆ తర్వాత స్థానాల్లో కోచిలోని బీపీసీఎల్ (4,800 టన్నులు), రష్యాకు చెందిన నయారా ఎనర్జీ (4,480 టన్నులు) నిలుస్తాయి. ఈ మూడు కంపెనీలు కలిసి రోజుకు 27,280 టన్నుల ఎల్పీజీ ఉత్పత్తి చేయగలవు.

2025-26 ఆర్థిక సంవత్సరంలో దేశంలో 33.2 మిలియన్ టన్నుల ఎల్పీజీ వినియోగమైంది, అంటే రోజుకు సగటున 91,000 టన్నులు. ఇందులో 13.1 మిలియన్ టన్నులు మాత్రమే దేశీయంగా ఉత్పత్తి కాగా, మిగిలిన 21.3 మిలియన్ టన్నులను విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వచ్చింది. చమురు ఉత్పత్తి, వినియోగంపై ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకోసారి సమీక్ష నిర్వహించి, తదనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటుంది.

# పొంగిన గంగ.. నిలిచిన బోట్లు



వారణాసిలో గంగానది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో సందర్శకుల భద్రతను దృష్టిలో పెట్టుకుని బోటు సర్వీసులు నిలిపివేశారు. శనివారం ఉదయానికి గంగానదిలో నీటిమట్టం 64.7 మీటర్లకు చేరింది. ఇది గంటకు 6 సెంటీమీటర్ల చొప్పున పెరుగుతోంది. వర్షాల కారణంగా నీటి ప్రవాహం ఉధృతమవుతుండటంతో బోట్లు నడపడం సురక్షితం కాదని.. సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. సందర్శకులు నదిలోకి వెళ్లొద్దని, అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నీటి ప్రవాహాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఈ నిర్ణయం కొనసాగుతుందని తెలిపారు. మరోవైపు, బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణంగా ఒడిశాతోపాటు ఏపీలోని ఉత్తర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది. ఒడిశాకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఆగస్టు 16నుంచి 18 వరకు వర్షాలు కొనసాగుతాయని తెలిపింది.



## మురుగుకాల్వలో మహాభాగ్యం!

భూగర్భ పైపులను మారుస్తుండగా భారీగా బంగారు నాణేలు, గోల్డ్ బార్స్ దొరికాయి. వాటి విలువ దాదాపు రూ.98 కోట్లు ఉంటుందని అంచనా. ఈ ఘటన బెల్జియంలోని బ్రస్సెల్స్‌లో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన చిత్రాలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. ఇంతకీ ఏం జరిగిందంటే.? పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర బ్రస్సెల్స్‌కు దాదాపు 18 మైళ్ల దూరంలో కార్మికులు మురుగు కాలువల పునరుద్ధరణ పనులు చేపట్టారు. తవ్వకాల సమయంలో భారీగా బంగారు నాణేలు బయటపడ్డాయి. తవ్వకాల సమయంలో ముందుగా కొన్ని నాణేలు బయటపడ్డాయి. మొదట వాటిని సాధారణ నాణేలుగా భావించినప్పటికీ, తవ్వకం కొనసాగించే కొద్దీ భారీగా బంగారు కడ్డీలు దర్శనమిచ్చాయి. ఒకింత ఆశ్చర్యానికి గురై విషయాన్ని వెంటనే సమీప పోలీసులకు తెలియజేశారు. వారు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. వాటి విలువ దాదాపు రూ.98 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. వెంటనే బంగారాన్ని ప్రభుత్వ భద్రత లాకర్‌కు తరలించారు. బంగారు ఎక్కడిదీ అనే దానిపై దర్యాప్తు చేపట్టారు.



## ఆకాశంలో 65 జెండాల సాహసం!

లిబియాలో 65 మంది స్కైడైవర్లు జాతీయ జెండాలతో చేసిన సాహస విన్యాసం గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది. వీరిలో ముగ్గురు భారతీయులు ఉండటం విశేషం. కేరళలోని కన్నూరుకు చెందిన జంషీర్ థనలోట్, ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌కు చెందిన అభిషేక్ రావత్, బిహార్‌లోని పాట్నాకు చెందిన ఇషా రాజ్ ఈ ఘనత సాధించిన వారిలో ఉన్నారు. యూఏఈలో నివసిస్తున్న వీరు ఆగస్టు 7న లిబియాలో ఈ సాహసం చేశారు. 13 వేల అడుగుల ఎత్తులో సైనిక విమానంనుంచి 65మంది ఒకేసారి దూకారు. ప్రతి ఒక్కరూ తమ తమ దేశ జెండాలను వెంట తీసుకెళ్లారు. సుమారు 38 దేశాలకు చెందిన వారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఒకే విమానం నుంచి జాతీయ జెండాలతో అత్యధిక మంది స్కైడైవర్లు ఒకేసారి దూకిన రికార్డుగా ఇది నమోదైంది. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ తాజాగా దీనిని అధికారికంగా ధ్రువీకరించింది.

# రష్యాపై వెయ్యి డ్రోన్ల వర్షం

### అర్ధరాత్రి విరుచుకుపడిన ఉక్రెయిన్

రష్యాపై ఉక్రెయిన్ వెయ్యికిపైగా డ్రోన్లతో విరుచుకుపడింది. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు చేసిన దాడుల్లో ఎనిమిది వందల డ్రోన్లను కూల్చివేసినట్టు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. మాస్కోలోని పలు ప్రదేశాలే లక్ష్యంగా దాడులు చేపట్టినట్లు ఉక్రెయిన్ సైన్యం వెల్లడించింది. మాస్కో ఆయిల్ రిఫైనరీకి సమీపంలోనూ ఈ దాడులు జరగడంతో అక్కడ పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. భారీగా పొగ వ్యాపించింది. ఈ దాడుల్లో ఆరుగురు ప్రాణాలు కోల్పోగా.. పదుల సంఖ్యలో ప్రజలు గాయాలపాలయ్యారు. దాడుల కారణంగా మాస్కోలోని ప్రధాన విమానాశ్రయాలు తాత్కాలికంగా మూతపడ్డాయి. దీంతో పలు విమానాలు రద్దవ్వగా.. మరికొన్ని ఆలస్యంగా నడిచాయి. గత ఐదేళ్లలో కీవ్.. మాస్కోపై చేసిన అతిపెద్ద దాడుల్లో ఇదీ ఒకటని రష్యా మీడియా కథనాలు వెల్లడించాయి. క్రిమియాపైనా ఉక్రెయిన్ పెద్దఎత్తున దాడులు కొనసాగిస్తోంది. సైనిక సరఫరాలను, విద్యుత్తు వ్యవస్థల్ని స్తంభింపజేసేలా తాజా దాడులు జరిపింది. క్రిమియాలోని క్షిపణి వ్యవస్థలపై దాడి చేసినట్టు ఉక్రెయిన్ తెలిపింది. మరోవైపు తెల్లవారుజామున కీవ్‌ని అనేక ప్రాంతాలపై రష్యా డ్రోన్ దాడులు చేసింది. ఈ దాడుల్లో అనేక నివాసాలు, దుకాణాలు మంటల్లో చిక్కుకున్నాయి.





## లింకన్ పోయి.. వాషింగ్టన్ వచ్చె

అమెరికా ఇప్పుడు పశ్చిమాసియా నుంచి తన విమానవాహక నౌక యూఎస్ఎస్ అబ్రహాం లింకన్‌ను వెనక్కి రప్పిస్తోంది. దాని స్థానంలో పశ్చిమ పసిఫిక్ నుంచి యూఎస్ఎస్ జార్జ్ వాషింగ్టన్‌ను పంపుతోంది. దీంతో ఇండో-పసిఫిక్ ప్రాంతంలో తాత్కాలికంగా అమెరికన్ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్లు ఉండని పరిస్థితి తలెత్తుతోంది. నిజానికి యూఎస్ఎస్ అబ్రహాం లింకన్.. నిర్దేశిత గడువుకన్నా ఎక్కువకాలమే పశ్చిమాసియాలో విధులు నిర్వర్తించింది. వరుసగా 240కన్నా ఎక్కువ రోజులు సాగరంలో ఉంది. దీంతో సిబ్బందిలో అలసట, మానసిక ఆరోగ్య సమస్యలు, సరకుల సరఫరాలవంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నిజానికి ఈ భారీ నౌక మేలోనే స్వదేశానికి వెనుదిరగాల్సింది. ట్రంప్ రెండో విడత అధికారం చేపట్టాక సైనిక చర్యల కోసం ఎక్కువగా విమానవాహక నౌకలపైనే ఆధారపడ్డారు. 11 నెలల మోహరింపు తర్వాత యూఎస్ఎస్ జెరాల్డ్ ఆర్ ఫోర్డ్ మేలో స్వదేశానికి తిరిగొచ్చింది. అది సాగరంలో విధులు నిర్వర్తించినప్పుడు ఇరాన్‌పై పోరు, వెనెజువెలా నాయకుడు నికోలస్ మదురో నిర్బంధంవంటి ఆపరేషన్లకు తోడ్పాటు అందించింది.

## మిషిగన్‌లో మృత్యుఘోష

### రెండు రాష్ట్రాలు, రెండుచోట్ల కాల్పులు

అమెరికాలోని మిషిగన్‌లో శుక్రవారం చోటుచేసుకున్న కాల్పుల్లో ఐదుగురు మరణించారు. డెట్రాయిట్‌కు 270 కిలోమీటర్ల దూరంలోని మిస్సాకీ కౌంటీలో ఘటన చోటుచేసుకుంది. చాద్ హిక్ మన్ (39) అనే నిందితుడు తొలుత కాల్పులు జరిపి 16ఏళ్ల బాలుడు, 45 ఏళ్ల వ్యక్తి, 40 ఏళ్ల మహిళను చంపాడు. అక్కడినుంచి పరారై మరోచోటకు వెళ్లి అక్కడ కాల్పులు జరిపాడు. అక్కడ హిక్మాన్‌తోపాటు 53 ఏళ్ల వ్యక్తి, 29 ఏళ్ల మహిళ మృతదేహాలు లభ్యమయ్యాయి. బాలికను వేధించిన కేసులో హిక్మాను 2024లో శిక్ష పడింది.

అమెరికాలోని వర్జీనియా స్టేట్ యూనివర్సిటీలో శనివారం తెల్లవారుజామున కాల్పుల ఘటన చోటుచేసుకుంది. దీనిలో ఐదుగురు గాయపడ్డారు. వీరు ఎవరనేది అధికార వర్గాలు గానీ, పోలీసులు గానీ వెల్లడించలేదు. విశ్వవిద్యాలయానికి, వీరికి సంబంధం ఉందా? అనేదీ తెలపలేదు.

# ఇరాన్ పైలట్ల వివాదం భగ్గు

### మార్చిలో కూలిన యుద్ధవిమానాల పైలట్లు ఖతార్ వద్దే బందీలని ఇరాన్ ఆరోపణ.. ఖండించిన దోహా



తమ సైన్యానికి చెందిన ముగ్గురు పైలట్లను ఖతార్ బంధించిందని, వెంటనే విడిచిపెట్టాలని ఇరాన్ డిమాండ్ చేసింది. అయితే, ఇరాన్ ఆరోపణలను ఖతార్ ఖండించింది. పైలట్లను బంధించామన్న ప్రచారంలో నిజం లేదని అధికారిక ప్రకటన విడుదల చేసింది. అమెరికా, ఇరాన్ యుద్ధంలో భాగంగా.. అమెరికా సైనిక బేస్ కలిగిన ఇతర గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులకు దిగిన సంగతి తెలిసిందే. దుబాయ్, యూఏఈ, సౌదీ, ఖతార్, బహ్రెయిన్‌వంటి దేశాలలోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ దాడులు చేసింది. ఈ క్రమంలో గత ఏప్రిల్‌లో ఖతార్‌లోని అమెరికా బేస్‌లపై ఇరాన్ వైమానిక దాడులకు దిగింది. అయితే, ఖతార్‌లోని అమెరికా సైన్యం ఈ విమానాల్ని కూల్చివేసింది. ఈ ఘటనలో ముగ్గురు పైలట్లు, విమానాల నుంచి దూకి తమనుతాము రక్షించుకున్నారని ఇరాన్ చెబుతోంది. అయితే, ఖతార్ భూభాగంలో దిగిన ముగ్గురు పైలట్లను ఆ దేశం బంధించిందని ఇరాన్ ఆరోపిస్తోంది. నెలలు గడుస్తున్నా వారిని తమకు అప్పగించడం లేదని చెబుతోంది. ఇరాన్‌కు చెందిన ఎస్‌యూ-24 విమానాల్ని ఖతార్ కూల్చివేయడంతో, ఆ విమానాల్లోని పైలెట్లు జావేద్ సలేహి, అబ్దోల్మాజిద్ దష్తియన్, ఒమ్రన్ బెహ్రవేషియన్‌లు ఖతార్ సైన్యానికి చిక్కారని, వారిని విడిచిపెట్టాలని ఇరాన్ డిమాండ్ చేస్తోంది. అయితే, ఇరాన్ వాదనను ఖతార్ కొట్టేసింది. తమ వద్ద ఇరాన్ సైనికులు ఎవరూ లేరని చెబుతోంది. ఈ మేరకు ఖతార్ విదేశాంగ శాఖ ప్రతినిధి మాజెద్ అల్ అన్సారీ సోషల్ మీడియా వేదికగా ప్రకటన చేశారు. తాము విమానాలు కూల్చిన ఘటనలో సైనికుల కోసం పూర్తి స్థాయిలో సోదాలు, సహాయక చర్యలు చేపట్టామని వివరించింది. అయితే, తమకు ఏ ఒక్క సైనికుడు కూడా దొరకలేదని చెప్పింది. ఇదే సమయంలో ఒక సైనికుడికి సంబంధించిన అస్తికల్ని గతంలోనే ఇరాన్‌కు అందజేశామని పేర్కొంది. ఈ విషయంపై కొంతకాలంగా వివాదం కొనసాగుతున్నా.. ఇరు దేశాలు తమ వాదనకు కట్టుబడి ఉన్నాయి.



## భళా.. అంకిత దయాని

ఆసియా గేమ్స్ సమీపిస్తోన్న వేళ భారత అథ్లెట్ అంకిత దయాని అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. స్టంఫ్టాన్ ట్విలైట్ వేదికగా 1500మీ రన్‌లో తన కెరీర్లోనే అత్యుత్తమ టైమింగును నమోదు చేసింది. గతం కంటే ఐదు సెకన్ల ముందే రేస్‌ను పూర్తి చేయడం గమనార్హం. అయితే, స్టంఫ్టాన్ ట్విలైట్ రేసులో రెండో స్థానం వరించింది. తన రేసును 4.06.75 నిమిషాల్లో పూర్తి చేసింది. అగ్రస్థానం సాధించిన కార్మెన్ అల్డెర్ (4.06.40) కంటే దయాని టైమింగ్ కాస్త మాత్రమే తక్కువ. భారత అథ్లెట్ ఇంత ఫాస్ట్‌గా రేసును ముగించడం ఇదే తొలిసారి. ఇక ఆమె కెరీర్ బెస్ట్ 4:12.28 నిమిషాలు. ఇంతకుముందు ఎప్పుడూ 4:10 నిమిషాల్లో రేసును ముగించని దయాని బెస్ట్ రన్‌తో ఆశ్చర్యపరిచింది. దీంతో రాబోయే ఆసియా గేమ్స్‌లో 1500మీ, 3000మీ స్టీపుల్‌చేజ్‌లో పతకాలు సాధిస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు.



## జకోవిచ్‌కు షాక్!

**సిన్సినాటి ఓపెన్‌లో ఓటమి**

**జకో ఫిట్‌నెస్‌పై అనుమానాలు**

టెన్నిస్ స్టార్ ఆటగాడు జకోవిచ్‌కు సిన్సినాటి ఓపెన్‌లో షాక్ తగిలింది. రెండో రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టాడు. తొలి సెట్‌లో గెలిచిన జకోవిచ్.. తర్వాత రెండు సెట్లను కోల్పోయి ఓటమిని చవిచూశాడు. అర్జెంటీనా ఆటగాడు థియాగో టిరంటే 2-6, 6-4, 6-4 తేడాతో జకోవిచ్‌పై విజయం సాధించాడు. గత వింబుల్డన్ తర్వాత 39 ఏళ్ల జకోవిచ్ తలపడిన మొదటి టోర్నీ ఇదే. సిన్సినాటి ఓపెన్ జకోవిచ్ ఓటమికంటే అభిమానులను ఆందోళనకు గురి చేసే అంశం మరొకటి ఉంది. మరికొద్ది రోజుల్లో యూఎస్ ఓపెన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో జకో ఫిట్‌నెస్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. సిన్సినాటి ఓపెన్ సమయంలో తీవ్రంగా ఇబ్బందిపడ్డాడు. అక్కడి వాతావరణం దెబ్బకు వాంతులు కూడా చేసుకోవాల్సి వచ్చిందని టెన్నిస్ వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం అమెరికాలో వేసవికాలం. దీంతో ఎండలు విపరీతంగా ఉన్నాయి. యూఎస్ ఓపెన్ సమయంలోనూ ఇదే వాతావరణ పరిస్థితులుంటాయి. తీవ్ర పోటీ ఉండే గ్రాండ్‌స్లామ్‌లో విజేతగా నిలవాలంటే మాత్రం జకోవిచ్ తన ఫిట్‌నెస్‌పై దృష్టిపెట్టాల్సిందే.

# పడిక్కల్ 167.. భారత్ 460/9

గాలేలో జరుగుతున్న తొలి టెస్టులో భారత్ రెండో రోజు ఆటను 460/9 స్కోరుతో ముగించింది. వర్షం కారణంగా ఆలస్యంగా మొదలైన ఆట మధ్యాహ్నం 2.35 గంటలకు మైదానం తడిగా ఉండటంతో ప్రారంభమైంది. ఓవర్‌నైట్ స్కోరు 288/2తో బరిలోకి దిగిన టీమిండియా, అద్భుతం మిశ్రమ ప్రదర్శన కనబరిచింది. దేవ్‌దత్ పడిక్కల్ తన కెరీర్‌లోనే అత్యుత్తమ స్కోరు 167 పరుగులు (230 బంతుల్లో, 15 ఫోర్లు, ఒక సిక్స్) సాధించి జట్టును పటిష్ఠ స్థితిలో నిలిపాడు. అయితే డబుల్ సెంచరీకి 33 పరుగుల దూరంలో ఉండగా, ప్రభాత్ జయసూర్య వేసిన వేగవంతమైన బంతికి ముందుకొచ్చి ఆడబోయి స్టంపౌట్ అయ్యాడు. వికెట్ కీపర్ నిరోషన్ డిక్వెలా చాకచక్యంగా బెయిల్స్ తీయడంతో పడిక్కల్ ఇన్నింగ్స్ ముగిసింది. మైదానమంతా నిల్చుని చప్పట్లతో అతడిని సత్కరించడం విశేషం. రిషభ్ పంత్ (39) డెబ్యూటెంట్ కేశర నువంతను ఎగరగొట్టబోయి మిడాఫ్‌లో క్యాచ్ ఇచ్చాడు. కేఎల్ రాహుల్ (82) కూడా వెనుదిరిగాడు. వరుసగా కీలక వికెట్లు కోల్పోవడంతో మధ్యాహ్న సెషన్‌లో శ్రీలంక స్పిన్నర్లు పట్టు బిగించారు. మొత్తంగా 172 పరుగుల వ్యవధిలో భారత్ ఏడు వికెట్లు కోల్పోయింది.

ఈ కష్టకాలంలో ధ్రువ్ జురెల్ (51) కీలక పాత్ర పోషించాడు. అతడు, మానవ్ సుతార్ (24)తో కలిసి టీ సెషన్‌లో విలువైన భాగస్వామ్యం నెలకొల్పి స్కోరును నిలబెట్టాడు. రవీంద్ర జడేజా కూడా త్వరగా వెనుదిరగగా, మొహమ్మద్ సిరాజ్ చివరిలో కొన్ని ఉపయోగకరమైన పరుగులు జోడించాడు.

శ్రీలంక బౌలర్లలో ప్రభాత్ జయసూర్య (4/109) అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడు. కుల్దీప్ యాదవ్ (12), ప్రసిద్ధ్ కృష్ణ (1) క్రీజులో నిలిచి ఉండగా, సోమవారం ఒక వికెట్ మిగిలి ఉన్న స్థితిలో భారత్ తన ఇన్నింగ్స్‌ను కొనసాగించనుంది.



# చరిత్ర సృష్టించిన బంగ్లాదేశ్

**ఆస్ట్రేలియాపై ఘన విజయం.. ఈ ఓటమి..మింగుడుపడనిదే: కమిన్స్**

ఆస్ట్రేలియా గడ్డపై బంగ్లాదేశ్ తొలిసారి టెస్టు మ్యాచ్‌లో విజయం సాధించి చరిత్ర సృష్టించింది. డార్విన్‌లో జరిగిన తొలి టెస్టులో ఆతిథ్య ఆస్ట్రేలియాను 9 వికెట్ల తేడాతో చిత్తు చేసి బంగ్లాదేశ్ సంచలన విజయాన్ని నమోదు చేసింది. 40 ఏళ్ల అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలో బంగ్లాదేశ్‌కు ఇది అత్యంత చిరస్మరణీయ గెలుపుగా నిలిచింది. ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 284 పరుగులకే ఆలౌట్ కావడంతో బంగ్లాదేశ్ ముందు 57 పరుగుల స్వల్ప లక్ష్యం నిలిచింది. నాలుగో రోజు రెండో సెషన్‌లోనే బంగ్లా ఆ లక్ష్యాన్ని ఛేదించింది. మొమినుల్ హక్ 30, షాద్మాన్ ఇస్లామ్ 25 పరుగులతో నాటౌట్‌గా నిలిచి జట్టును విజయతీరాలకు చేర్చారు.

మెహదీ, హసన్ మహ్మూద్ అద్భుత ప్రదర్శన

బంగ్లాదేశ్ విజయంలో బౌలర్లు కీలక పాత్ర పోషించారు. మెహదీ హసన్ మిరాజ్ ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు పడగొట్టి బ్యాటింగ్ లైనప్‌ను దెబ్బతీశాడు. మ్యాచ్‌లో బ్యాటింగ్‌లోనూ 65 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. మరో పేసర్ హసన్ మహ్మూద్ మ్యాచ్‌లో 9 వికెట్లు పడగొట్టి ఆస్ట్రేలియా పతనాన్ని శాసించాడు. అతడికి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

గ్రీన్ సెంచరీ చేసినా..

ఆస్ట్రేలియా తరఫున కామెరాన్ గ్రీన్ పోరాడాడు. దాదాపు ఐదు గంటలపాటు క్రీజులో నిలిచిన అతడు సొంతగడ్డపై తొలి టెస్టు సెంచరీ నమోదు చేశాడు. అయితే అతడి పోరాటం ఆస్ట్రేలియాను ఓటమి నుంచి కాపాడలేకపోయింది. హసన్ మహ్మూద్ బౌలింగ్‌లో గ్రీన్ బౌల్డ్ కావడంతో ఆస్ట్రేలియా చివరి ఆశలు కూడా ఆవిరయ్యాయి.




బంగ్లాదేశ్‌కు అరుదైన ఘనత

ఆస్ట్రేలియా గత 23 టెస్టుల్లో 18 విజయాలతో బలమైన జట్టుగా కొనసాగుతోంది. మరోవైపు విదేశీ గడ్డపై బంగ్లాదేశ్ రికార్డు అంతంతమాత్రంగానే ఉంది. అలాంటి పరిస్థితుల్లో ఆస్ట్రేలియాను వారి సొంతగడ్డపైనే 9 వికెట్ల తేడాతో ఓడించడం బంగ్లా క్రికెట్‌లో ప్రత్యేక ఘట్టంగా మారింది. ఆస్ట్రేలియాలో టెస్టు విజయం సాధించాలన్న బంగ్లాదేశ్ కల ఎట్టకేలకు నిజమైంది. ఈ చారిత్రక విజయంతో రెండు జట్ల మధ్య జరగనున్న రెండో టెస్టుపై ఆసక్తి మరింత పెరిగింది.

మింగుడుపడని ఓటమి: కమిన్స్

స్వదేశంలో.. చిన్న జట్టు చేతిలో ఊహించని ఓటమిపై ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ స్పందించాడు. అన్ని విభాగాల్లో తమకంటే బంగ్లాదేశ్ గొప్పగా ఆడిందని.. ఈ ఓటమి నుంచి తేరుకోవడం తమకు కష్టంగా ఉండనుందని అన్నాడు. డార్విన్ టెస్టులో తొలి రోజునుంచి ఆధిపత్యం చెలాయించిన బంగ్లాదేశ్ చరిత్రాత్మక విజయం నమోదు చేసింది. ఊహించని పరాజయంపై ఆసీస్ సారథి ప్యాట్ కమిన్స్ మ్యాచ్ అనంతరం ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తమకంటే బంగ్లాదేశ్ గొప్పగా ఆడిందని పేర్కొన్న ప్యాట్.. అన్ని విభాగాల్లోనూ విఫలమయ్యాని అంగీకరించాడు. 'బంగ్లాదేశ్ ఆటగాళ్లు చాలా గొప్పగా ఆడారు. చెప్పాలంటే అన్ని విభాగాల్లోనూ మమ్మల్ని వెనక్కినెట్టారు. ఈరోజు బంగ్లా స్పిన్నర్లు చాలా ప్రమాదకరంగా కనిపించారు. ఆ జట్టు పేసర్లు వికెట్లు తీశారు. బ్యాటర్లు కీలక భాగస్వామ్యాలు నెలకొల్పారు. ఈ విజయానికి అర్హులు వాళ్లే. ఒకసారి వెనకబడ్డాక.. మళ్లీ పుంజుకోవడం మాకు కష్టమే' అని కమిన్స్ వ్యాఖ్యానించాడు.

## ఫాతిమాకే పగ్గాలు



మహిళల ఆసియా కప్ కోసం పాకిస్తాన్ క్రికెట్ బోర్డు స్క్వాడ్‌ను ప్రకటించింది. ఇటీవల శ్రీలంక పర్యటనకు దూరమైన ఫాతిమా సనాకు కెప్టెన్సీ అప్పగిస్తూ 15మందితో కూడిన బృందాన్ని ఎంపిక చేశారు సెలెక్టర్లు. దుబాయ్‌లో ఆగస్టు 28నుంచి మొదలయ్యే ఈ టోర్నీలో సీనియర్లు మునీబా అలీ, గుల్ ఫిరోజ్, తుబా హసన్ కీలకం కానున్నారు. అలానే సెప్టెంబర్‌లో మొదలయ్యే ఆసియా క్రీడల్లో కూడా పాక్ బృందానికి ఫాతిమానే సారథ్యం వహించనుంది. 'ది హండ్రెడ్ లీగ్' కోసం శ్రీలంక పర్యటనకు దూరమైన ఫాతిమా సనా తిరిగి కెప్టెన్సీ చేపట్టనుంది. ఆసియా కప్, ఆసియా క్రీడల్లో పాక్ మహిళల జట్టును నడిపించనుందీ పేస్ ఆల్‌రౌండర్. ఆసియా కప్‌తోపాటు ఆసియా క్రీడల కోసం ఆదివారం పాక్ బోర్డు స్క్వాడ్‌ను ప్రకటించింది. అయేషా జఫర్, గుల్ ఫిరోజా, మునీబా అలీ, నష్ర సంధు, షవాల్ జుల్ఫికర్లు.. రెండు టోర్నీలకు ఎంపికయ్యారు. ఇక ఆసియా కప్ కోసం నలుగురిని, ఆసియా క్రీడల కోసం ఐదుగురిని రిజర్వ్ ప్లేయర్లుగా తీసుకుంది పీసీబీ.

చైతన్య రథం

# సినిమా

సోమవారం 17 ఆగస్టు 2026 **X**

## రామాయణ బడ్జెట్‌పై క్లారిటీ



కన్నడ రాకింగ్ స్టార్ యష్ హీరోగా నటించిన టాక్సిక్ ఇప్పుడు విడుదలకి దగ్గరలో ఉంది. ఈ సినిమా తర్వాత తాను విలన్ రోల్‌లో నటించిన మోస్ట్ అవైటెడ్ పాన్ వరల్డ్ చిత్రం 'రామాయణ' రాబోతుంది. అయితే ఈ సినిమాని హాలీవుడ్ అత్యున్నత ప్రమాణాలతో తెరకెక్కించిన నేపథ్యంలో మేకర్స్ కూడా ఈ సినిమాకి బడ్జెట్ ఏకంగా రూ.4000 కోట్లు పెట్టామనే మాట ఒక్కసారిగా షాకింగ్‌గా మారింది. యష్‌తో సహ నిర్మాత అయినటువంటి నమిత్ మల్హోత్రా ఇచ్చిన స్టేట్మెంట్‌పై యష్ అసలు క్లారిటీ ఇచ్చాడు. రామాయణకి 4000 కోట్లు బడ్జెట్ అనే మాట కేవలం ఒక్క సినిమాకి సంబంధించింది కాదు అని రెండు భాగాలకు కలిపిన బడ్జెట్ మాత్రమే కాకుండా సినిమాకి జరిగిన ఇతర ఖర్చులు, వరల్డ్ వైడ్ ప్రమోషన్స్ అన్నీ కలిపి ఒక హాలీవుడ్ సినిమాకి ఏ తరహాలో ఖర్చు చేస్తారో అలానే చేశామని అది అసలు ఉద్దేశమని రివీల్ చేశాడు. దీనితో రామాయణ బడ్జెట్‌పై ఓ క్లారిటీ బయటకి వచ్చింది. ఇక రామాయణ సినిమా ఈ ఏడాది నవంబర్ 8న ఇండియాలో గ్రాండ్‌గా విడుదల కాబోతుంది.

## 'బాధలో ఉన్నప్పుడు గుర్తొచ్చేది తనే'



నటి అనుపమ పరమేశ్వరన్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించి పలు ఆసక్తికర విషయాలను ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. తాను కష్టకాలంలో ఉంటే.. సినీ పరిశ్రమ నుంచి ఇద్దరు హీరోలు ఎంతో అండగా నిలుస్తారని వెల్లడించారు. తాను బాధలో ఉన్నప్పుడు గుర్తుకొచ్చే మొదటి పేరు మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ అని తెలిపారు. "నేను డల్‌గా ఉన్న ప్రతిసారీ దుల్కర్ నుంచి నాకు మెసేజ్ వస్తుంది. నేను బాధలో ఉన్న విషయం ఆయనకు ఎలా తెలుస్తుందో అని ఆశ్చర్యపోతుంటాను. అలా దుల్కర్ కాసేపు మాట్లాడితే నా బాధంతా పోతుంది. ఆయన తర్వాత నేను అంతగా నమ్మే మరో వ్యక్తి టాలీవుడ్ హీరో రామ్" అని ఆమె తెలిపారు. ఇదే ఇంటర్వ్యూలో అనుపమ తన గత ప్రేమ కథ గురించి కూడా మాట్లాడారు. మాజీ ప్రియుడి చేతిలో తాను ఎదుర్కొన్న మానసిక వేధింపుల గురించి వివరించారు. "నార్సిసిస్టిక్ అబ్యూస్ (మానసిక వేధింపుల) అనేది చాలా సైలెంట్‌గా జరుగుతుంది. అలాంటి వాళ్లు ఎప్పుడూ ఇతరులను తమ కంట్రోల్లో ఉంచుకోవాలని చూస్తారు" అని అనుపమ పేర్కొన్నారు. గతంలో దుల్కర్, అనుపమ కలిసి 'జోమోంటే సువిశేషంగల్' అనే మలయాళ చిత్రంలో నటించారు. ఇక దుల్కర్ సల్మాన్ నటించిన తాజా చిత్రం 'ఐయామ్ గేమ్' సెప్టెంబర్ 3న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## 'బ్రహ్మ'గా బ్రహ్మానందం





అక్కినేని సుమంత్ హీరోగా, సంతోష్ జాగర్లపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఆధ్యాత్మిక సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రం 'మహేంద్రగిరి వారాహి'. వారాహి అమ్మవారి దివ్య శక్తి, పురాతన నమ్మకాలు, అంతుచిక్కని రహస్యాల నేపథ్యంలో సినిమా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపొందుతోంది. ఈ చిత్రంలో టాలీవుడ్ లెజెండరీ నటుడు, 'హాస్య బ్రహ్మ' బ్రహ్మానందం విలక్షణమైన 'బ్రహ్మ' పాత్రలో కనిపించనున్నారు. ఈ నేపథ్యంలో చిత్రబృందం ఆయన పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను అధికారికంగా విడుదల చేసింది. సినిమా స్క్రిప్ట్‌నచ్చి ఆయన ఈ ప్రాజెక్ట్‌లో భాగమయ్యారని, ఈ పాత్ర చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని మేకర్స్ చెబుతున్నారు. సుమంత్ హీరోగా నటిస్తున్న చిత్రంలో ఐశ్వర్య రాజేష్, మీనాక్షి గోస్వామి, మాళవిక నాయర్, బ్రహ్మానందం, వెన్నెల కిషోర్, రాజీవ్ కనకాల తదితరులు ప్రధాన తారాగణం. రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు బ్రిడ్జ్ ఫిలిమ్స్ బ్యానర్లపై కలిపు మధు, లక్ష్మణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుంటే.. అనూప్ రూబెన్స్ సంగీతం సమకూరుస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని సెప్టెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్‌కు సినిమా సిద్ధమవుతోంది.

## సూర్య రికార్డుల మోత

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య బాక్సాఫీస్ వద్ద తన సత్తా ఏంటో మరోసారి నిరూపించారు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన తాజా పాన్ ఇండియా చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్' బాక్సాఫీస్ వద్ద సంచలన వసూళ్లతో దూసుకుపోతోంది. సినిమా విడుదలైన కేవలం రెండు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్లకుపైగా గ్రాస్ కలెక్షన్లను సాధించి అరుదైన రికార్డును సృష్టించింది. ఈ చిత్రంలో సూర్య సరసన మమిత బైజు హీరోయిన్‌గా నటించగా, రాధికా శరత్‌కుమార్, రవీనా టాండన్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించారు. జీవీ ప్రకాష్‌కుమార్ అందించిన సంగీతం సినిమా విజయానికి ప్రధాన బలంగా నిలిచింది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్, శ్రీకర స్టూడియోస్ పతాకాలపై సూర్య సృష్టించిన ఈ సునామీ వసూళ్లతో ట్రేడ్‌వర్గాలు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుతం థియేటర్ల వద్ద 'బ్లాక్‌బస్టర్ విశ్వనాథ్ అండ్ సన్స్' జోరు కొనసాగుతుండటంతో చిత్ర యూనిట్ ఆనందంలో మునిగిపోయింది. త్వరలోనే ఈ సినిమా మరిన్ని రికార్డులను బ్రేక్ చేసే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.




## మళ్లీ వినిపించిన 'అబు.. బాగ్దాద్ గజదొంగ'




ప్రస్తుతం పాన్ ఇండియా, పాన్ వరల్డ్ ట్రెండ్ నడుస్తోంది కానీ, దాదాపు పాతికేళ్ల కిందటే అగ్ర కథానాయకుడు చిరంజీవి ఇలాంటి సబ్జెక్ట్ ముందుకు రావాల్సి ఉంది. సినిమా కొంతభాగం షూటింగ్ జరుపుకొని కూడా ఆగిపోయింది. ఆ సినిమా చేసి ఉంటే చిరంజీవి రేంజ్ హాలీవుడ్ స్థాయికి చేరేదేమో. అదే 'అబు: బాగ్దాద్ గజదొంగ'. మళ్లీ ఇన్నేళ్ల తరువాత ఈ మూవీ మాట మరోసారి సోషల్ మీడియాలో వినిపించింది. అంటే సినిమా మళ్లీ మొదలు పెడతారని కాదండోయ్. అప్పట్లో ఈ ప్రాజెక్ట్ ఎంత పెద్దదో తాజా ఇంటర్వ్యూలో పంచుకున్నారు దర్శక ద్వయం పుష్కర్ అండ్ గాయత్రి.

'విక్రమ్ వేద' వంటి థ్రిల్లర్‌తో అలరించిన వీరు వెబ్ సిరీస్‌లతో ఓటీటీని ఓ ఊపు ఊపేస్తున్నారు. 'సుడల్', 'వదంతి', ఇటీవల వచ్చిన 'వదంతి-2' వెబ్‌సిరీస్‌లతో థ్రిల్ పంచారు. తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఈ జోడీ చిరంజీవి 'అబు: బాగ్దాద్ గజదొంగ' మూవీ గురించి ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. ఇండస్ట్రీలో అడుగు పెట్టిన తొలినాళ్లలో వీరిద్దరూ ఈ ప్రాజెక్ట్ కోసం పనిచేశారట. గాయత్రి ఈ చిత్రానికి సహాయక దర్శకురాలిగా పనిచేయగా, పుష్కర్ కెమెరా విభాగంలో పనిచేశారట. అప్పట్లో అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను రూపొందించాలనుకున్నట్లు చెప్పారు. దాదాపు రూ.40 కోట్ల భారీ బడ్జెట్ అనుకుని సినిమాను మొదలు పెట్టినట్లు తెలిపారు. తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో తీర్చిదిద్దాలనుకున్న ఈ మూవీ తెలుగు వెర్షన్‌కు సురేశ్ కృష్ణ దర్శకత్వం వహించగా, ఇంగ్లీష్ వెర్షన్ను డవెన్ జెర్రీ అనే హాలీవుడ్ డైరెక్టర్ పనిచేశారట. హాలీవుడ్ నుంచే కాకుండా యూకే, ఆస్ట్రేలియా నుంచి వచ్చిన సినీ నిపుణులు ఈ ప్రాజెక్టులో భాగమయ్యారట. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో షూటింగ్ చేయాలనుకున్నట్టు గాయత్రి తెలిపారు. మూడు నెలలపాటు అజంత, ఎల్లోరా, ఔరంగాబాద్, రాజస్థాన్, జైపూర్, జైసల్మేర్, థార్ ఎడారిలో షూటింగ్ చేసినట్లు పుష్కర్ వివరించారు.

ఇక ఈ సినిమా కోసం అప్పట్లో చాలా అరుదుగా వాడే కెమెరా మోషన్ కంట్రోల్ రిగ్స్‌ను తొలిసారి ఇండియాకు తీసుకొచ్చారని పుష్కర్ తెలిపారు. స్పెషల్ ఎఫెక్ట్ షాట్స్ కోసం దాన్ని వాడేవారని, అప్పటికే దానిపై తనకు అవగాహన ఉండటంతో ఈ ప్రాజెక్టులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఇప్పుడు సీజీ ఉందని, అప్పట్లో ఫిల్మ్ కారణంగా ప్రతి షాట్ కచ్చితత్వంతో తీయాల్సి వచ్చేదన్నారు. ఈ సినిమా కోసం పనిచేసింది తక్కువ సమయమే అయినా, చాలా విషయాలు నేర్చుకున్నట్లు తెలిపారు. ఫిల్మ్‌మేకర్స్ అవ్వాలనుకున్న వారికి ఇప్పుడు చాలా వేదికలున్నాయని అప్పట్లో ఇన్ని లేవని చెప్పుకొచ్చారు.

## రవితేజ మాస్ ఎనర్జీతో ట్రాన్స్

మాస్ మహారాజ రవితేజ హీరోగా నటించిన లేటెస్ట్ అవైటెడ్ చిత్రం 'ఇరుముడి'. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కించిన ఈ డివోషనల్ థ్రిల్లర్‌పై సాలిడ్ హైప్ ఇప్పుడు నెలకొంది. అయితే ఈ సినిమాపై ఉన్న అంచనాల్లో చార్ట్ బస్టర్ సాంగ్ మల్లెపూల పల్లకి సాంగ్‌పట్ల నెలకొన్న ఆసక్తి కూడా చాలా ఉంది. సినిమా స్టార్ట్ చేసిన కొన్ని రోజుల్లోనే ఈ సాంగ్ ఉందని వచ్చిన టాక్ సినిమాపై మరింత అంచనాలు తీసుకొచ్చేలా చేసింది.

ఇక ఫైనల్‌గా ఈ సాంగ్ కోసం చూస్తున్న ఫ్యాన్స్‌కి నేడు మేకర్స్ ఈ పాటని విడుదల చేసేసారు. ఒరిజినల్ సాంగ్‌ని ఆలపించిన దప్పు శ్రీనుతోనే పాడించి తనదైన ట్యూనింగ్‌తో జీవి ప్రకాష్ సాలిడ్ చార్ట్ బస్టర్‌ని అందించారు. ఈ సాంగ్‌లో మాస్ మహారాజ రవితేజ ఎనర్జీ అదనపు ఆకర్షణ అని చెప్పాల్సిందే. ఇలా మొత్తానికి అందరూ ఎంతగానో ఎదురు చూస్తున్న సాంగ్ వచ్చి అనుకున్నట్టే ఫ్యాన్స్‌ని ట్రాన్స్‌లోకి తీసుకెళ్తుంది. ఇక ఈ అవైటెడ్ సినిమా తెలుగు, తమిళ్‌లో 21న విడుదల కాబోతుంది.

